ANN తెలుగు

Follow: @ANNTELUGU

30-09-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 296 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## గిన్నిస్ రికార్డుల్లోకి తెలంగాణ బతుకమ్మ

సరూర్ నగర్ స్టేడియంలో 66.5 అడుగుల బతుకమ్మ

వేడుకల్లో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రజాగాయకురాలు విమలక్క

వివరాలు 2లో

**ఎలక్షన్ టాక్**

### స్థానిక రిజర్వేషన్లకు అందరూ సహకరించండి

- మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి
- వందకు వంద శాతం ఎక్కువ స్థానాలు తామే గెలుస్తామని ధీమా



02

### లోకల్ ఫైట్‌కు మేము రెడీ

- గల్లీ నుంచి ఢిల్లీ దాకా గులాబీదే హవా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



02

### స్థానిక ఎన్నికల్లో నెం.1గా నిలుస్తాం

- 42శాతం రిజర్వేషన్లకు మా మద్దతు
- బిజెపి అడ్డుకుంటే జీవో ఎలా ఇచ్చారు?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



03

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,15,480 |
| 22 క్యారెట్ | 1,05,850 |
| సిల్వర్ (కేజీ) | 1,49,000 |


# మోగిన ఎన్నికల నగారా

## ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఆ వెంటనే సర్పంచ్ ఎన్నికలు

రెండు దశల్లో పరిషత్.. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

అక్టోబర్ 9న నోటిఫికేషన్.. ఆ రోజు నుండే నామినేషన్లు

వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని

**రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. సోమవారం మీడియా సమావేశంలో వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని వెల్లడించారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లుగా పేర్కొన్నారు. మొత్తం ఈ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఐదు దశల్లో జరుగుతుందని రాణికుముదిని తెలిపారు. 12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.**

- మహా, హైదరాబాద్

వివరాలు 2లో



## రేవంత్ మాస్టర్ స్కెచ్

బీఆర్ఎస్ బీజేపీకి షాక్

2లో

### అద్భుతం జరిగితేనే..

# స్థానిక ఎన్నికలు

**న్యాయనిపుణుల అంచనా**

**కొట్టివేసే ఛాన్సే అధికం**

**హైదరాబాద్-మహా:** రాష్ట్ర ఎన్నికలసంఘం రిజర్వేషన్లు ఖరారుచేసింది. షెడ్యూల్ ప్రకటించేసింది. ఎన్నడూలేని రీతిలో నోటిఫికేషన్ కు మాత్రం పదిరోజుల గడువిచ్చింది. హైకోర్టు రిజర్వేషన్ల జీవో పై నిర్ణయాన్ని అక్టోబర్ 8కి వాయిదావేయడంతో 9న నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ జీవో నిలబడదని న్యాయనిపుణులు, బీసీ సంఘాల ప్రముఖులు అంటున్నారు. కోర్టు ఇప్పటికే ఇలా ప్రశ్నలు వేసిందని, నిర్ణయమే వెలవడాల్సి ఉందని బీసీ సంఘ ప్రముఖులు, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు అన్నారు.

**ఏం జరుగుతుంది?**

ప్రస్తుతం గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్ లో ఉంది. గవర్నర్ అక్టోబర్ 7లోగా ఆమోదిస్తే ఎన్నికలకు అవకాశం ఉంది.

మిగతా 2లో

**ఓటర్లు**

| | |
|---|---|
| పురుషులు | 81,65,894 |
| మహిళలు | 85,36,770 |

| పోలింగ్ లొకేషన్స్ | పంచాయతీల వివరాలు |
|---|---|
| గ్రామపంచాయతీలు | 12,733 |
| వార్డులు | 1,12,288 |
| పోలింగ్ స్టేషన్లు | 1,12,474 |
| పోలింగ్ కేంద్రాలు | 15,522 |






**జూబ్లీహిల్స్ బాధ్యత**

## కిషన్ రెడ్డిదే..

వచ్చే ఎన్నికలు జమిలే

మీడియా చిట్ చాట్ లో ఎంపీ అర్వింద్ హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పూర్తి బాధ్యత కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిదేనని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హాట్ కామెంట్స్ చేశారు. వచ్చే ఎన్నికలు జమిలి అయ్యే చాన్స్ ఉందని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కథ ముగిసిందని..ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు.

మిగతా 2లో

# అతిపెద్ద సినిమా పైరసీ ముఠా అరెస్ట్

500 సినిమాల పైరసీ..రూ.3,700 కోట్ల నష్టం

మంత్రమాల్‌లో 40 సినిమాలు రికార్డ్

ఒక్క ఏడాది లక్ష డాలర్లు సంపాదించిన ముఠా




**హైదరాబాద్, మహా:** తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠా ఆటకట్టించి సంచలనంగా మారారు. ముఠాలో కీలకంగా ఉన్న ఆరుగురితో పాటు మరికొంతమందిని అరెస్ట్ చేశారు. వీరు తెలుగుతో పాటు పలు భాషల సినిమాలను పైరసీ చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. పైరసీ మూలంగా 2024లో తెలుగు చిత్ర పరిశ్రమ రూ. 3700 కోట్లు నష్టపోయిందని ఆనంద్ తెలిపారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సమగ్ర దర్యాప్తు చేశామని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. పైరసీ మూవీస్ వల్ల ఆన్‌లైన్ బెట్టింగ్ లకు కూడా ప్రేక్షకులు అలవాటు పడుతున్నారని ఆయన తెలిపారు. నిందితులు ఓ వెబ్‌సైట్, టెలిగ్రామ్ ద్వారా పైరసీ మూవీలు స్ట్రీమింగ్ చేస్తున్నారని ఆనంద్ తెలిపారు. సర్వర్స్ హ్యాకింగ్‌తో పాటు క్యామ్ కార్డర్ ద్వారా నిందితులు సినిమాలను పైరసీ చేస్తున్నారని వివరించారు.

మిగతా 2లో



## సరస్వతి దేవిగా దుర్గమ్మ

**పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు**

**విజయవాడ, మహా :** విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రులు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు, అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా చదువుల తల్లి సరస్వతి దేవి అలంకరణలో భక్తులను అమ్మవారు అనుగ్రహిస్తున్నారు. అటు, కనకదుర్గమ్మకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. దసరా శరన్నవరాత్రుల్లో ప్రభుత్వం తరఫున మూలా నక్షత్రం రోజ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఆలయానికి సీఎం దంపతులకు మంత్రులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం దుర్గమ్మను దర్శించుకుని, వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందుకున్నారు.

### లోకేశ్ అన్నా... ఇది నీకోసమే అంటూ తిలక్ వర్మ గిఫ్ట్

ముగ్ధుడైన నారా లోకేశ్

- భారత్ విజయంలో కీలకపాత్ర పోషించిన తిలక్ వర్మ
- తమ్ముడూ నీ చేతుల మీదుగా అందుకునేందుకు ఎదురుచూస్తుంటానన్న లోకేశ్



02



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
జనరల్ వార్తలు | GENERAL NEWS
మంగళవారం, హైదరాబాద్ | 29-09-2025
ANN తెలుగు

## గిన్నిస్ రికార్డుల్లోకి తెలంగాణ బతుకమ్మ

**సరూర్ నగర్ స్టేడియంలో 66.5 అడుగుల బతుకమ్మ**

**వేడుకల్లో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రజాగాయకురాలు విమలక్క**



**హైదరాబాద్, మహా :** తెలంగాణ బతుకమ్మ గిన్నిస్ రికార్డు కొట్టింది. సరూర్‌నగర్ మైదానంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. స్టేడియంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 66.5 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ వద్ద మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొత్తం పదివేల మందికి పైగా మహిళలు ఈ వేడుకల్లో పాల్గొనగా 1354 మంది మహిళలతో ఒకేసారి బతుకమ్మ ఆడించి.. గిన్నిస్ రికార్డు సాధించారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు బతుకమ్మ చుట్టూ లయబద్ధంగా ఆడి పాడారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క మహిళలతో కలిసి ఆట పాటలతో అలరించారు. బతుకమ్మ చుట్టూ నిల్చొని పాటలు పాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత కచేరి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అతిపెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా రెండు గిన్నీస్ రికార్డులు సృష్టించింది. స్టేడియంలో ఒకేసారి 1354 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ప్రజాగాయకురాలు విమలక్క కూడా బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మోగిన ఎన్నికల నగారా

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. సోమవారం మీడియా సమావేశంలో వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని వెల్లడించారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లుగా పేర్కొన్నారు. మొత్తం ఈ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఐదు దశల్లో జరగుతుందని రాణికుముదిని తెలిపారు. 12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

**అక్టోబర్ 9 నుండి నామినేషన్లు**

ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల తేదీలివే : ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి అక్టోబర్ 9వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని రాణికుముదిని తెలిపారు. అక్టోబర్ 23న తొలి విడత, 27వ తేదీన మలి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత పోలింగ్ నవంబర్ 4వ తేదీన, మూడో విడత నవంబర్ 8వ తేదీన నిర్వహిస్తామన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతామని వివరించారు. నవంబర్ 11వ తేదీన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని రాణికుముదిని వివరించారు. సర్పంచ్ ఎన్నికలు ముగిసిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఫలితాలు వెల్లడిస్తామన్నారు. మొత్తం 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఎస్ఈసీ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు 1.12 లక్షల పోలింగ్ స్టేషన్లను గుర్తించామన్నారు. రిజర్వేషన్లకు సంబంధించి ఆదివారం సాయంత్రమే గెజిట్లు విడుదల చేసినట్లుగా వివరించారు. అన్ని జిల్లాలు, మండలాల్లో రిజర్వేషన్ల ఖరారు జరిగిందన్నారు.

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ముఖ్యమైన తేదీలివే :**

- మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహణ
- రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహణ
- అక్టోబర్ 9 నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలివిడత నామినేషన్లు
- అక్టోబర్ 13 నుంచిఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు రెండో విడత నామినేషన్లు
- అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్
- అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల రెండో విడత పోలింగ్
- నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

**మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహణ**

- అక్టోబర్ 17న సర్పంచ్ ఎన్నికలకు తొలి విడత నోటిఫికేషన్ జారీ
- అక్టోబర్ 17 నుంచి 19 వరకు తొలి విడత నామినేషన్ల స్వీకరణ.
- సర్పంచ్ ఎన్నికలకు అక్టోబర్ 31న తొలి విడత పోలింగ్, ఫలితాలు.
- సర్పంచ్ ఎన్నికలకు అక్టోబర్ 21న రెండో విడత నోటిఫికేషన్.
- రెండో విడతలో అక్టోబర్ 21న నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ.
- నవంబర్ 4న రెండో విడత సర్పంచ్ ఎన్నికలకు పోలింగ్, ఫలితాలు.
- మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు అక్టోబర్ 25న నోటిఫికేషన్.
- మూడో విడతలో అక్టోబర్ 25 నుంచి 27 వరకు నామినేషన్ల స్వీకరణ.
- మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు నవంబర్ 8న పోలింగ్, ఫలితాలు.

## జూబ్లీహిల్స్ బాధ్యత కిషన్ రెడ్డిదే..

**వచ్చే ఎన్నికలు జమిలే**

**మీడియా చిట్ చాట్ లో ఎంపీ అర్వింద్ హాట్ కామెంట్స్**

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ఆయన మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడారు. 'నా జిల్లా వరకు ఎన్నికలకు మేము ఎప్పటి నుంచో సిద్ధంగా ఉన్నాం. నిజామాబాద్ జడ్పీ చైర్మన్ స్థానం మేమే గెలుస్తున్నాం. ఎవరికి బిట్టు బెడితే వాళ్లే అభ్యర్థి అంటే.. కేసీఆర్ ను చూసి ఓట్లు వేస్తారా..? కేటీఆర్ నా.?' అని ప్రశ్నించారు.

**ఆయన్ను జైల్లో పెట్టింది రేవంత్ మర్చిపోయారా?**

బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి రాదని నేను బాండ్ పేపర్ రాసిస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ లేదా కాంగ్రెస్ మాత్రమే అధికారంలోకి వస్తుందన్నారు. కేసీఆర్ అర్ధరాత్రి తనను అరెస్ట్ చేసి జైల్లో పెట్టిన ఘటనను సీఎం రేవంత్ రెడ్డి మర్చిపోయాడా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్కామ్ లలో ఎందుకు కేసీఆర్, కేటీఆర్ లను అరెస్టు చేయడం లేదంటూ అర్వింద్ నిలదీశారు. కల్వకుంట్ల కుటుంబాన్ని జనం నమ్మే రోజులు పోయాయన్నారు. 2028 వరకు బీఆర్ఎస్ నేతల్లో ఎవరు జైల్లో ఉంటారో తెల్వదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాత్రమే పోటీ ఉంటుందన్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో కాండిడేట్స్ కీలకం అని, పార్టీలకు పెద్దగా సంబంధం ఉండదు అని చెప్పారు. కల్వకుంట్ల కవిత ఎక్కడ పోటీ చేయరని, నిజామాబాద్ జిల్లా కోడలు గా కవితను భావిస్తూ.. ఒక శ్రేయోభిలాషిగా చెబుతున్న.. పార్టీ పెట్టవద్దు అంటూ కామెంట్స్ చేశారు.

## ముగ్గురు పిల్లలుంటే పోటీకి అనర్హులే

**పంచాయతీరాజ్ చట్టంలో నో చేంజ్**

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ఎన్నికల హడావుడి మొదలైంది. మూడు విడుతల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనుంది. అదే విధంగా రెండు విడుతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో సంతానం లిమిట్ ఎత్తేశారా..? లేదా..? అన్న అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతానం లిమిట్ ఎత్తివేశారు. 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడంలో భాగంగా ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. తర్వాత పలు మార్పులు జరిగాయి. 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించిన కేసీఆర్ ప్రభుత్వం ఈ విషయాన్ని టచ్ చేయలేదు. పాత పద్ధతికే రైట్ చెప్పింది. ప్రస్తుతం కుటుంబ నియంత్రణపై అవగాహన పెరిగినందున పాత నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు కోరాయి. గతేడాది డిసెంబర్ 20న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ ప్రతిపాదన రాగా మంత్రి వర్గం ఆమోదించలేదు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తేసే యోచనలో ఉన్నట్టు తెలిపారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 21(3) స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారు అనర్హులు. 1994 తర్వాత మూడో సంతానం కలిగితే వారు అనర్హులని తేల్చింది. ఇటీవలి కాలంలో దక్షిణాదిలో జనాభా తగ్గిపోతోందని, ఈ క్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు తగ్గే చాన్స్ ఉందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలను కనాలని ఆదేశించారు. ఈ మేరకు ఏపీలోని పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించారు. దీంతో తెలంగాణలో సవరిస్తారని చర్చ జరిగింది. ఇటీవల పంచాయతీరాజ్ చట్టంలోని రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం.. సెక్షన్ 21(3)ని సవరించలేదు. దీంతో ముగ్గురు పిల్లల నిబంధన యథాతథంగా ఉండనుంది. ఈ క్రమంలో పాత నిబంధనల ప్రకారమే సర్పంచ్, వార్డు మెంబర్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి.

## రేవంత్ మాస్టర్ స్కెచ్

**బీఆర్ఎస్ బీజేపీకి షాక్**

**హైదరాబాద్ మహా:** స్థానికసంస్థల ఎన్నికలు ప్రధాన రాజకీయపార్టీలకు చాలెంజ్ గా మారాయి. బీఆర్ఎస్ పార్టీకి ఇది పెద్దపరీక్ష. ఇప్పటికే గత అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో దెబ్బతిన్న బీఆర్ఎస్ పార్టీకి.. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటడం అత్యంత ముఖ్యం. ఇక్కడ తేడా కొడితే పార్టీ నుండి పెద్ద ఎత్తున వలసలు పెరిగే ప్రమాదముంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను దెబ్బకొడితే స్టేట్ పాలిటిక్స్ లో ఎదురుండదని సీం వ్యూహరచన చేశారు. జూబ్లిహిల్స్ బైపోల్ లోనూ దీనిని వ్యూహాత్మకంగా వినియోగించుకోనున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు , సన్నబియ్యం వంటి కార్యక్రమాలతో పాటు గ్రూప్1 నియామకాలు, గ్రూప్2 ఫలితాలు వెల్లడించాకే ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత పకడ్బందీగా దీనిని వ్యూహరచన చేసినట్లు కనబడుతోంది. ఓ వైపు బీసీ రిజర్వేషన్ల అంశం కోర్టులో ఉన్నప్పటికీ నోటిఫికేషన్‌కు మొగ్గుచూపడం వెనుక బీఆర్ఎస్, బీజేపీలకు చెక్ పెట్టే వ్యూహం స్పష్టంగా కనబడుతోంది. బీసీ రిజర్వేషన్ల విషయంలో తాము చేయగలిగినదంతా చేశామని చివరకు జీవో ద్వారా అమలు చేయబోతే కోర్టులకు వెళ్లారని ఈ అంశాన్ని తమకు సానుకూలంగా మార్చుకునే అవకాశం కోసం అంతా సిద్ధం చేసకుంది. అయినా ఓకే.. తేడావచ్చినా విపక్షాలు కోర్టుకెళ్ళడం వల్లే ఇదంతా జరిగిందని ఎదురుదాడి చేయవచ్చన్న వ్యూహంతో అధికారకాంగ్రెస్ పార్టీ ఉంది.

## స్థానిక రిజర్వేషన్లకు అందరూ సహకరించండి

**మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి**

**వందకు వంద శాతం ఎక్కువ స్థానాలు తామే గెలుస్తామని ధీమా**

**హైదరాబాద్, మహా:** 42 శాతం రిజర్వేషన్ వల్ల ఎవరికీ నష్టం వాటిల్లదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లకు అందరూ సహకరించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. 50 శాతం రిజర్వేషన్ పరిమితి గురించి కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, మార్పులు చేసుకోవడానికి రాజ్యాంగం అవకాశం కల్పించిందని గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి న్యాయపరంగా, చట్టపరంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని మంత్రి తెలిపారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇచ్చాయని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. ఇప్పుడు మాట మార్చకుండా సహకరించాలని ఆయన కోరారు.



**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం..**

అందరి మద్దతుతోనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని న్యాయస్థానంలో కూడా ప్రస్తావిస్తామని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇవ్వడంతో తాము స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా కోర్టులను ఆశ్రయించి ఎన్నికలు ఆపాలని చూస్తే చేసేది ఏం లేదని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వానికి ప్రజల్లో ఎక్కడ వ్యతిరేకత లేదని... అసంతృప్తి లేదని స్పష్టం చేశారు. వందకు వంద శాతం స్థానాలు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎంఏయూడీ, హెచ్ఎండీఏ , జీహెచ్ఎంసీలలో అవినీతి జరుగుతోందని ఆరోపణలు చేస్తున్న వారు.. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రూ. 5లకే బ్రేక్‌ఫాస్ట్ పథకం ద్వారా చాలామంది ఆకలి తీరుతోందని వివరించారు. ప్రస్తుతం బ్రేక్‌ఫాస్ట్ పథకం 80 చోట్ల మాత్రమే అమల్లో ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో 150 డివిజన్లలో అందుబాటులోకి తెస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## అద్భుతం జరిగితేనే.. స్థానిక ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టంలో 285(ఏ) ప్రకారం రిజర్వేషన్లు 50శాతం దాటకూడదు. ఇది చట్టరూపంలో ఉంది. దీనిని అసెంబ్లీలో తొలగించలేదు. చట్టం ముందు జీవో నిలబడదు. 9వ షెడ్యూల్ ద్వారా మాత్రమే రిజర్వేషన్ల పెంపు సాధ్యం. అయితే.. ఏజీ సమర్ధవాదనలు వినిపించి, బెంచ్ ఆ వాదనలోని పాయింట్లు చట్టానికి లోబడి.. గత తీర్పులకు లోబడి ఉంటే జరగవచ్చు. నిజంగా అలా జరిగితే భారతదేశంలోనే ఇది అద్భుతమని, అలాంటి అద్భుతం జరగాలని తాము ఆశిస్తున్నమని బీసీసంఘాల మేధావులు తమ అభిప్రాయంగా చెబుతున్నారు. ఇలా జరిగితే స్థానిక ఎన్నికల్లో దాదాపు 70 శాతం రిజర్వేషన్లతో జరుగుతాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ జీవో చట్టం ముందు, న్యాయస్థానాల ముందు పరీక్షకు నిలవదని.. అక్టోబర్ 8 లేదా 9న జీవో కొట్టివేయవచ్చని, నోటిఫికేషన్ ఇచ్చినా అది నిలిచేది కాదని పలువురు న్యాయనిపుణులు అంటున్నారు. ప్రభుత్వవర్గాలు మాత్రం తాము చేయగలిగిందంతా చేశామని, ఇక సమాజమే దీనిని కాపాడుకోవాలని విజ్ఞప్తిచేస్తోంది.

## లోకేశ్ అన్నా... ఇది నీకోసమే అంటూ తిలక్ వర్మ గిఫ్ట్

**విజయవాడ, మహా :** దుబాయ్ లో గతరాత్రి జరిగిన ఆసియా కప్2025 ఫైనల్లో టీమిండియా అద్భుత విజయం సాధించగా, చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ ను ఓడించి 9వ సారి కప్ కైవసం చేసుకోవడంలో తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ ప్రధాన పాత్ర పోషించాడు. టాప్3 బ్యాటర్లు పెవిలియన్ చేరిన క్రమంలో ఎంతో నిబ్బరంగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. వర్మ 53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులతో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కాగా, మ్యాచ్ అనంతరం ఆసక్తికర దృశ్యం ఆవిష్కృతమైంది. తన క్యాప్‌ను తిలక్ వర్మ ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కు కానుకగా ఇచ్చాడు. లోకేశ్ అన్నా ఇది నీకోసమే... ప్రేమతో ఇస్తున్నాను అంటూ ఆ క్యాప్ పై రాసి సైన్ చేశాడు. ఈ మేరకు వీడియో పంపించాడు. దీనిపై మంత్రి నారా లోకేశ్ స్పందించాడు. తిలక్ వర్మ అభిమానం తనను ముగ్ధుడ్ని చేసిందని పేర్కొన్నాడు. "తమ్ముడూ... నీ ప్రేమ పట్ల ఎంతో సంతోషిస్తున్నాను... నువ్వు భారత్ తిరిగిరాగానే ఆ క్యాప్ ను నీ చేతుల మీదుగా అందుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తుంటాను... నువ్వు ఛాంపియన్" అంటూ ట్వీట్ చేశారు.





## లోకల్ ఫైట్‌కు మేము రెడీ

**గల్లీ నుంచి ఢిల్లీ దాకా గులాబీదే హవా..**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు ప్రారంభించిన 'బాకీ కార్డు' ఉద్యమమే రేవంత్ సర్కార్ ను భరతం పట్టే బ్రహ్మాస్త్రమన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. గల్లీ ఎన్నికలైనా, ఢిల్లీ ఎన్నికలైనా గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని, తెలంగాణలోని సబ్బండ వర్ణాలు తిరిగి కేసీఆర్‌నే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నాయన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ప్రదీప్ చౌదరి, కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్, తాము ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోయారన్న భ్రమల్లో కాంగ్రెస్ నేతలు ఉన్నారని కానీ ప్రజలకు అన్నీ గుర్తున్నాయన్నారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలను గుర్తుచేయడానికే 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ అభయహస్తం ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు. ఈ బాకీ కార్డే కాంగ్రెస్ పతనాన్ని శాసిస్తుందన్నారు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించుకున్నట్టుగా, హైదరాబాద్ నగరం సమస్యలతో ఆగమాగం అవుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త నగరం కడతానంటూ ఊదరగొట్టే ఉపన్యాసాలు ఇస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ ప్రభుత్వ అసమర్థతతో హైదరాబాద్‌లో చెత్త తీసేవారు కరువయ్యారని, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, వీధి దీపాలు వెలగడం లేదని మండిపడ్డారు. ఉన్న నగరాన్ని ఉద్ధరించలేని వారు కొత్త నగరం కడతామని ఫోజులు కొట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో 42 ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పేర్చలేదని, కనీసం ఉన్న రోడ్లను కూడా సరిగా నిర్వహించడం లేదని విమర్శించారు.

**కొత్త నగరం కడతామని ఫోజులు..**

రాష్ట్రంలో రైతులు, మహిళలు, వృద్ధులు, నిరుద్యోగులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధ పాలనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎరువుల కోసం రైతులు యుద్ధాలు చేసే దుస్థితి ఉండేదని, నేడు మళ్లీ అవే రోజులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కోసం క్యూలైన్లలో చెప్పులు పెట్టే, ప్రాణాలు కోల్పోయే దారుణ పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని, తిరిగి కేసీఆర్ నాయకత్వాన్ని ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాగంటి గోపినాథ్ నాయకత్వంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదని గుర్తుచేశారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆయన సతీమణి మాగంటి సునీతను ప్రజలు బంపర్ మెజారిటీతో గెలిపించడం ఖాయమని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రదీప్ చౌదరి వంటి ప్రజాబలం ఉన్న నాయకుల చేరికతో బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. తెలుగువారి ఖ్యాతిని యావత్ భారతదేశానికి చాటిచెప్పింది ఎన్టీఆర్ అయితే, తెలంగాణ అస్తిత్వ పతాకాన్ని, సత్తాను హిమాలయాల స్థాయిలో ఎగరేసింది కేసీఆర్ అని కేటీఆర్ కొనియాడారు. 14 ఏళ్లు అలుపెరగని పోరాటం చేసి సాధించుకున్న రాష్ట్రాన్ని, పదేళ్ల పాలనలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు.



# అతిపెద్ద సినిమా పైరసీ ముఠా అరెస్ట్

**500 సినిమాల పైరసీ..రూ.3,700 కోట్ల నష్టం.. మంత్రమాల్‌లో 40 సినిమాలు రికార్డ్.. ఒక్క ఏడాది లక్ష డాలర్లు సంపాదించిన ముఠా**

(మొదటిపేజీ తరువాయి)

బెట్టింగ్ గేమింగ్ యాప్స్ నిర్వాహకులు పైరసీ చేసే వారికి డబ్బులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. 'బెట్టింగ్ యాప్ నిర్వాహకులు పైరసీ మూవీల ద్వారా వారి యాప్‌లను ప్రచారం చేసుకుంటున్నారు. ''టెలిగ్రామ్ ఛానల్స్, టొరెంట్స్ ద్వారా సినిమాల పైరసీ జరుగుతోందని సీవి ఆనంద్ తెలిపారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ చేసిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. తమిళ్ బ్లాస్టర్స్, ఫైవ్ మూవీ రూల్స్, తమిళ్ మూవీ వెబ్‌సైట్ తదితర వెబ్‌సైట్లలో పైరసీ సినిమాలను అందుబాటులో ఉంచుతున్నారని వెల్లడించారు. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన జానా కిరణ్ కుమార్ ప్రధాన నిందితుడు అని వెల్లడించారు. కిరణ్ అత్తాపూర్‌లోని మంత్ర మాల్ థియేటర్‌లో సినిమాలు కాపీ చేశాడన్నారు. నలబై మూవీలు ఈ థియేటర్‌లో కాపీ చేసినట్లు గుర్తించారు. ప్రతి సినిమాకు 300 నుంచి 400 డాలర్లను బిట్ కాయిన్స్ రూపంలో కిరణ్ కుమార్ తీసుకుంటున్నాడు. అనంతరం క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ ప్లాట్ ఫాంని ఉపయోగించి ఇండియన్ కరెన్సీలోకి మార్చుకుంటున్నారు. దర్యాప్తులో భాగంగా 44 మంది అనుమానితులను విచారించిన తర్వాత అసలు నిందితుడు జానా కిరణ్ కుమార్‌గా తేలిందన్నారు. కిరణ్ థియేటర్‌కు వెళ్లి కెమెరా ద్వారా రికార్డింగ్ చేసి పైరసీకి పాల్పడుతున్నారన్నారు. అందరూ విస్తుపోయేలా డిజిటల్ శాటిలైట్‌ను కూడా హ్యాక్ చేసి పైరసీ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసి బెట్టింగ్, గేమింగ్ యాప్ ప్రకటనల ద్వారా ఆదాయం పొందుతున్నారని తెలిపారు. 'సింగిల్', 'హిట్' సినిమాల పైరసీ జరిగినప్పుడు మాకు ఫిర్యాదులు అందాయని వెల్లడించారు.




**పాప్ కార్న్ డబ్బాలో.. సెల్ ఫోన్**

హైఎండ్ కెమెరా ఉన్న సెల్‌ఫోన్‌తో నిందితులు సినిమాను రికార్డింగ్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. సెల్‌ఫోన్లను జేబులో గానీ, పాప్‌కార్న్ డబ్బాలో గానీ పెట్టుకుని సినిమాను రికార్డు చేస్తారని సీవీ ఆనంద్ తెలిపారు. ముఠా ప్రత్యేకమైన యాప్ ద్వారా సినిమాలను పైరసీ చేసిందన్నారు. రికార్డింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్ స్క్రీన్‌లైట్ కూడా ఆఫ్‌లో పెడుతారని దీనివల్ల ఎవరికీ అనుమానం రాదని తెలిపారు. ఇతర భాషల చిత్రాలను రికార్డింగ్ చేసేందుకు ప్రత్యేక ఏజెంట్లను నియమించుకున్నారన్నారు. సినిమా పైరసీలకు నెదర్లాండ్స్‌కు చెందిన ఐపీ అడ్రస్ వాడుతున్నారని సీవీ ఆనంద్ తెలిపారు. నిందితులు పోలీసులు ఎప్పటికీ పట్టుకోలేని టెక్నాలజీ వాడుతున్నారని, దానికి అనుగుణంగా పోలీసులు కూడా ఈ ముఠాను పట్టుకునేందుకు అత్యాధునిక టెక్నాలజీని వినియోగించాల్సి వచ్చిందన్నారు. మేం కేసును ఛేదించిన విధానం తెలిసి షాక్ నిందితులు షాక్ అయ్యారన్నారు. కిరణ్ కుమార్ బెట్టింగ్ యాప్‌ల నుంచి నెలకు సుమారు రూ.9 లక్షల వరకు చెల్లింపులు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కాగా నిందితులను పట్టుకున్న విధానాన్ని వివరిస్తూ.. క్రిప్టో కరెన్సీ పేమెంట్స్ ద్వారా మాకు కొంత క్లూ దొరికిందని, హ్యాకింగ్‌లో నిపుణుడైన పట్నాకు చెందిన మరో ప్రధాన నిందితుడు అశ్వనీకుమార్‌ను గుర్తించామన్నారు. డిజిటల్ మీడియా సర్వర్లను కూడా హ్యాక్ చేసే నైపుణ్యం అతడికి ఉందని . కొన్ని సందర్భాల్లో గవర్నమెంటు వెబ్‌సైట్లను కూడా హ్యాక్ చేశాడని పోలీసులు గుర్తించారు. ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌ను కూడా నిందితుడు హ్యాక్ చేశాడన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్లు హ్యాక్ చేసి ఉద్యోగులు, జీతాల వివరాలు తీసుకున్నాడన్నారు. బిహార్‌లోని పట్నాలో ఉన్న అశ్వనీకుమార్ ఇంటికి మా టీమ్ వెళ్లిన సమయంలో ఆ ఇంటి చుట్టూ 22 సీసీటీవీ కెమెరాలు గుర్తించమన్నారు. నిందితుల వల్ల పలు కంపెనీలు వారి ఉద్యోగులను అనుమానించే పరిస్థితి వచ్చిందని వివరించారు. సినిమాల పైరసీని ప్రధానంగా ప్రోత్సహిస్తున్నది.. బెట్టింగ్, గేమింగ్ యాప్ నిర్వాహకులే అని ఆనంద్ వివరించారు. ఎక్కువ సినిమాల పైరసీ కిరణ్, అశ్వనీకుమార్ ముఠా వల్లే జరిగినట్లు గుర్తించామన్నారు. పైరసీ ద్వారా నిందితులు లక్ష డాలర్ల వరకు సంపాదించినట్లు పోలీసులు గుర్తించారు. వీరే కాక ఈటీవీ కంటెంట్‌ను పైరసీ చేసిన హర్షవర్ధన్,నెదర్లాండ్, ప్యారిస్ ఐపీ అడ్రస్‌ల ద్వారా సినిమాలు పైరసీ చేసిన సిరిల్ తదితరులను కూడా పట్టుకున్నామన్నారు. వీరంతా ఇప్పటి వరకు 500 సినిమాలు పైరసీ చేసినట్లు గుర్తించాం." అని సీవీ ఆనంద్ తెలిపారు. సినిమాల పైరసీ వల్ల నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారని, సినిమా పరిశ్రమ బాగా ప్రభావానికి గురవుతోందని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. 2023లో మనదేశంలోని చిత్ర పరిశ్రమ రూ. 22,400 కోట్లు పైరసీతో నష్టపోయిందని సీపీ సీవీ ఆనంద్ వివరించారు.

## స్థానిక ఎన్నికల్లో నెం.1 గా నిలుస్తాం

- 42శాతం రిజర్వేషన్లకు మా మద్దతు
- బిజెపి అడ్డుకుంటే జీవో ఎలా ఇచ్చారు?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, మహా:** తమ పార్టీ బలహీనంగా లేదని, బలంగా ఉందని, రానున్న స్థానిక ఎన్నికల్లో నెం.1 గా నిలవబోతున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశ్యం జీవోలో లేనందున 42 శాతం రిజర్వేషన్లకు తాము మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ముందు నుండి నాటకాలు ఆడుతోందని ఆయన అన్నారు. అలాగే గవర్నర్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించిందని, అయితే ఇప్పుడు జీవోను ఎలా జారీ చేశారని ఆయన ప్రశ్నించారు.

**మాకు ఎలాంటి సంబంధం లేదు..**

ఈ జీవోను గతంలోనే ఇచ్చి ఉంటే సమస్య ఇంత వరకు వచ్చేది కాదని రామచందర్ రావు అభిప్రాయపడ్డారు. తమ పార్టీ ఎన్నికలకు పూర్తిగా సిద్ధంగా ఉందని రామచందర్ రావు ప్రకటించారు. స్థానిక ఎన్నికలపై కోర్టులకు వెళ్లిన వారికే ఆ విషయం తెలుసునని, తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి బలం బాగా పెరిగిందని, గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈసారి స్థానిక ఎన్నికల్లో తాము అత్యధిక స్థానాలు గెలుచుకుని నంబర్ వన్ పార్టీగా నిలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## 20 ఏళ్లు బీఆర్ఎస్ కోసం కష్టపడ్డా..

- కొందరిలో స్వార్థం ఇప్పుడు పురుడుపోసుకుంది
- అవసరం, సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతాం
- నా ఓటమి, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి వరకు ఎన్నో కుట్రలు
- జాతీయ పార్టీల్లో చేరే ఉద్దేశం లేదు.. కాంగ్రెస్ మునిగిపోయే పడవ
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు



**ఇంటర్నెట్ డెస్క్, మహా:** పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. లండన్‌లోని తెలంగాణ ప్రవాసులతో కవిత ముఖాముఖి మాట్లాడారు. తెలంగాణ జాగృతిని దేశానికి రోల్ మోడల్‌గా నిలపాలన్నదే సంకల్పమని చెప్పారు. సామాజిక తెలంగాణ కోసం జాగృతి పనిచేస్తుందన్నారు. 'అవసరం, సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతాం. ప్రజల జీవితాల్లో మార్పులు తేవడంపై స్పష్టమైన ఆలోచన ఉంది. తప్పనిసరిగా నాకు అవకాశం వస్తుంది. ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల సమయం ఉంది. అప్పటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలి. నా వెనక ఏ జాతీయ పార్టీ లేదు.. జాతీయ పార్టీల్లో చేరే ఉద్దేశం కూడా లేదు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ. అభివృద్ధి పథంలో సాగుతున్న తెలంగాణను భ్రష్టు పట్టిస్తోంది. బీజేపీ డీఎన్ఏ నాకు సరిపడదు.

**ఇబ్బందైనా తట్టుకొని నిలబడ్డా..**

20 ఏళ్లు బీఆర్ఎస్ కోసం కష్టపడ్డాను. కొందరిలో స్వార్థం పురుడుపోసుకుంది. వారివల్ల కోట్లాది మంది బాధపడొద్దన్నదే నా తపన. పార్టీలో చీలికలు రావొద్దని ఎంత ఇబ్బందైనా తట్టుకొని నిలబడ్డాను. పార్టీలో చాలా అవమానాలు ఎదురయ్యాయి. నా ఓటమి మొదలు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి వరకు ఎన్నో కుట్రలు జరిగాయి. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇప్పుడు మాట్లాడాల్సి వచ్చింది. విషయం ప్రజల్లోకి వచ్చిన తర్వాత వాటిపై స్పందించకపోతే తప్పవుతుంది. అందుకే మాట్లాడాల్సి వచ్చింది. పార్టీ నన్ను వద్దనుకుంది కాబట్టే.. పార్టీ ఇచ్చిన పదవిని వద్దనుకున్నాను. నిర్ణీత నమూనాలో రాజీనామా చేశాను. ఛైర్మన్ ఎందుకు ఆమోదించడం లేదో తెలియదు. నేను ఈ పరిస్థితికి రావడానికి అవతలి వాళ్లే కారణం. కష్టమవుతుందని తెలిసినా.. కేసీఆర్ బిడ్డగా ధైర్యంగా పంథాను ఎంచుకుంటాను. జైలు జీవితం నాలో అనేక మార్పులు తీసుకొచ్చింది.

## రెండు గంటలు సలహా ఇచ్చి రూ. 11 కోట్లు తీసుకున్నా...

- ప్రశాంత్ కిశోర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- ఇదీ... బీహార్ కుర్రాడి శక్తి అని వ్యాఖ్య
- వృత్తిపరమైన ఫీజులతోనే నిధులు సమకూర్చుకున్నానన్న ప్రశాంత్ కిశోర్
- ఆదాయపు పన్ను చెల్లించి పార్టీకి విరాళం ఇచ్చినట్లు వెల్లడి



**పాట్నా, మహా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. "నేను ఒక రెండు గంటల పాటు సలహా ఇచ్చినందుకు రూ. 11 కోట్లు తీసుకున్నాను. ఇదీ... ఈ బీహార్ కుర్రాడి సత్తా" అని అన్నారు. డొల్ల కంపెనీల ద్వారా తన పార్టీకి విరాళాలు వస్తున్నాయన్న ఆరోపణలపై ఆయన స్పందించారు. వృత్తిపరమైన ఫీజుల ద్వారానే తాను నిధులు సమకూర్చుకున్నానని ప్రశాంత్ కిశోర్ స్పష్టం చేశారు. జీఎస్టీ, ఆదాయపు పన్ను చెల్లించి తన సొమ్మును పార్టీకి విరాళంగా ఇచ్చానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. 1995లో ఒక హత్య కేసులో ఆయనను దోషిగా తేలారని, ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అప్పట్లో తాను మైనర్‌ను అంటూ తప్పుడు పత్రాలు సమర్పించడం ద్వారా ఆయన శిక్ష నుండి తప్పించుకున్నారని ఆరోపించారు. పదో తరగతి కూడా పూర్తి చేయని సామ్రాట్ చౌదరి డిగ్రీ పట్టా పొందడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆయన అన్నారు. ప్రజలంతా తమ పిల్లలను ఎలా చూసుకోవాలో లాలూప్రసాద్ యాదవ్‌ను చూసి నేర్చుకోవాలని అన్నారు. ఆయన కుమారుడు తేజస్వి యాదవ్ తొమ్మిదో తరగతి కూడా పాస్ కాలేదని, కానీ బీహార్‌కు రాజును చేయాలని లాలూ ప్రసాద్ ఉబలాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. సామాన్యుల పిల్లలు గ్రాడ్యుయేట్ చేసినా వారికి ఉద్యోగాలు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు!

### ప్రభుత్వం ఇచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే ఎన్నికలు

అభ్యర్థుల ఎంపికలో పారదర్శకతకు మండలాల వారీగా కమిటీలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**పాలేరు, మహా:** మొదటి విడతలోనే పాలేరు నియోజకవర్గంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయని, ఈ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆయా గ్రామాల్లోని ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. కూసుమంచిలోని పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలాల వారీగా సోమవారం ఆయన పార్టీ పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీఓ జారీ చేసి ఎన్నికలకు సిద్ధమైందని తెలిపారు. ఆ జాబితా ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి. ఇప్పటికే ఏ గ్రామంలో ఏ రిజర్వేషన్ అనే జాబితా వెలువడిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీఓను కొందరు హైకోర్టులో సవాల్ చేశారని, అక్టోబర్ 8న హైకోర్టు తీర్పు వెలువడనుందని.. ఆ తీర్పును స్వాగతిస్తూ.. కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గడిచిన 21 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిందని మంత్రి గుర్తు చేశారు.

### అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత..

ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, మౌలిక వసతులు ఇలా గ్రామాలన్నింటికీ చేరాయని వివరించారు. "ఈ పథకాలు అభ్యర్థుల విజయానికి ప్రధాన బలం అవుతాయి" అని అన్నారు. గ్రామాల్లో విభేదాలు ఉన్నా వాటిని చర్చల ద్వారా పరిష్కరించి ఐక్యతతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత కోసం ప్రతి మండలానికి తొమ్మిది మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఒకే గ్రామం నుండి అనేక మంది ఆశావహులు ఉన్నప్పుడు గెలుపు అవకాశాలు, పార్టీపై విధేయతను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థులను ఖరారు చేస్తామని తెలిపారు. రిజర్వేషన్ల కారణంగా పోటీకి దూరమైన వారికి వేరే అవకాశాలు కల్పిస్తాం అని హామీ ఇచ్చారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవు" అని మంత్రి పొంగులేటి హెచ్చరించారు.



## పంచాయతీ కార్యదర్శులకు శుభవార్త

- బిల్లుల క్లియరెన్స్ కోసం రూ.104 కోట్లు విడుదల
- గతంలో లేనట్లుగా కార్యదర్శులకు ఏకకాలంలో నిధులు రిలీజ్
- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టికి మంత్రి సీతక్క థాంక్స్

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు శుభవార్త చెప్పింది. ఈ మేరకు ఒకేసారి భారీ మొత్తంలో నిధులు విడుదల చేసింది. పంచాయతీ కార్యదర్శుల బిల్లుల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం రూ. 104 కోట్లు విడుదల చేసింది. దీంతో పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ అయ్యాయి. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చొరవతో ఎప్పుడూ లేని విధంగా ఒకే విడతలో ఇంత పెద్ద మొత్తాన్ని విడుదల చేసింది. ఈ చర్యతో పంచాయతీ కార్యదర్శులపై ఉన్న ఒత్తిడి తగ్గి ఊరట లభించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. "పంచాయతీ కార్యదర్శుల సమస్యలు అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెంటనే స్పందించి రూ. 104 కోట్లు విడుదల చేశారు. ఇంతకు ముందు ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి ఇంత పెద్ద మొత్తాన్ని విడుదల చేయడం పంచాయతీ వ్యవస్థ పటిష్టతకు దోహదం చేస్తుంది" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రాజెక్టులపై కేటీఆర్ పిచ్చి మాటలు

- మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** అచ్చంపేట సభలో మాజీ మంత్రి కేటీఆర్ ఆల్మట్టి ప్రాజెక్టుపై చేసిన కామెంట్స్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ప్రాజెక్టులపై పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం అడ్డగోలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆల్మట్టి ఎత్తు పెంచొద్దని సుప్రీంకోర్టు స్టే ఉందని ఆయన గుర్తుచేశారు. ఆల్మట్టి ఎత్తు పెంపుకు తాము వ్యతిరేకమని తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ఎత్తు పెంచకుండా అడ్డుకుంటామని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచకుండా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు. కోర్టులో వాదనల కోసం సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించామని తెలిపారు. కృష్ణా, గోదావరి నీటి వాటాలో కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయమే జరిగిందని ఆరోపించారు. కేటీఆర్ తన మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఉత్తమ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చర్చకు సిద్ధమా?

- 90 శాతం పనులు పూర్తి చేసినట్లు నిరూపిస్తే నా పదవికి రాజీనామా చేస్తా
- లేదంటే కేటీఆర్, హరీష్ రావు రాజీనామా చేస్తారా?
- బీఆర్ఎస్ నేతలకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఓపెన్ ఛాలెంజ్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. పాలమూరు రంగారెడ్డిపై కేటీఆర్ చెప్పినవన్నీ అబద్ధాలే అని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కేటీఆర్ అయినా హరీష్ రావు అయిన చర్చకు రావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 90 శాతం పనులు పూర్తి చేసినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. లేదంటే మీరు రాజీనామా చేస్తారా.. అని ప్రశ్నించారు. తాను కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందో రాదో అన్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు మంత్రి జూపల్లి కృష్ణారావు. తాను ఏం మాట్లాడానో పూర్తి వీడియో చూస్తే తెలుస్తుందని స్పష్టం చేశారు. కేటీఆర్ చర్చకు వస్తే.. పూర్తి వీడియో చూపిస్తా అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు రూ.8 లక్షల కోట్లు బాకీ ఉందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పులి పంజా విసిరితే బీఆర్ఎస్ గద్దె దిగిందని మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు చేశారు.

## లోకేష్ స్ఫూర్తిగా.. ప్రజలకు అండగా..

- దూసుకెళ్తున్న యరమల విజయ్ కిరణ్
- గుంటూరు కారం.. పేదలంటే మమకారం
- యువనేత పనితీరుపై ప్రశంసలు



**గుంటూరు, మహా:** రాజకీయాల్లోకి అనేకమంది వస్తుంటారు.. పోతుంటారు. చైతన్యం కలిగిన యువత రాజకీయాల్లోకి వస్తే ప్రజలకు న్యాయం జరుగుతుంది. ఆయన అగ్గిబరాటా. పేదలకు ఏదో చేయాలని నిత్యం తపిస్తుంటాడు. యువనేత లోకేష్ స్ఫూర్తిగా, దళిత చైతన్య కీర్తిగా యరమల విజయ్ కిరణ్ తెలుగు యువత వాయిస్ ను బలంగా చాటాడు. రాజకీయ చదరంగంలో, రణరంగంలో, రాజకీయ రణగొణ ధ్వనులలో, ఆరోపణలు, ప్రత్యారోపణల రాజకీయాల్లో.. యువతరం నిలదొక్కుకోవడం అంత ఆషామాషీ కాదు. చేసే పనిలో నిబద్ధత, ప్రజలకు సేవచేయాలన్న తపన.. ఆ యువనేతను ప్రత్యేకంగా నిలబెట్టింది. పల్నాడు పౌరుషం.. గుంటూరు కారం.. పేదల పట్ల మమకారం ఆ యువనేత రాజకీయ శ్రీకారం.. గుంటూరు నగరంలో ప్రజల మనసులు గెలుచుకుంటోంది. గుంటూరు 50వ డివిజన్ గుండెచప్పుడుగా మారిన యరమల విజయ్ కిరణ్ తెలుగుయువతలో అధికార ప్రతినిధిగా రాణించి ప్రత్యర్థులపై పాశుపతాస్త్రం అయ్యాడు. సీనియర్ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రాజకీయ చాణక్యం. కేంద్రమంత్రి పెమ్మసాని దూకుడు నుండి స్ఫూర్తి పొంది.. దళిత యువ చైతన్యజ్యోతిగా, వాయిస్ ఆఫ్ తెలుగుయువతగా రాజకీయ ప్రత్యర్థిపార్టీలపై విరుచుకుపడుతున్నాడు. యువమంత్రి లోకేష్ ను ఆరాధించే.. విజయ్ కిరణ్ తనకు పార్టీ ఏ బాధ్యత అప్పగించినా.. నెరవేరుస్తూ ప్రశంసలందుకుంటున్నాడు. స్వార్థానికి పునాదులు తవ్వుకుని మోసపు ముసుగులు తొడుక్కుని అసూయాద్వేషాలను ఒంటినిండా పూసుకున్న రాజకీయాల్లో విజయ్ కిరణ్ లాంటి నిస్వార్థ యువ నాయకులు అత్యంత అరుదు. పేదల కోసం నిత్యం పరితపించే విజయ్ కిరణ్ అంటే యువతలో ప్రత్యేక అభిమానం. యరపతినేని అండాదండ.. స్థానిక ప్రజలకు అండాదండగా ఉంటూ పసుపు చైతన్యబావుటాగా విజయ్ కిరణ్ దుమ్మురేపుతున్నాడు. చంద్రబాబు పథకాలు ప్రజలకు వివరించడంతో పాటు విపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని ఎండగడుతున్నాడు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. యువనేత లోకేష్ తో పాటు గుంటూరు పసుపు దిగ్గజాల ఆశీస్సులతో విజయ్ కిరణ్ మరిన్ని ఉన్నత అవకాశాలు పొందుతాడన్న ఆకాంక్షను స్థానిక యువకులు, కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు.

## స్థానిక సమరానికి బీజేపీ సై

### స్థానిక నగారా నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి బీజేపీ సిద్ధంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. "నాకు రాజకీయ జన్మనిచ్చిన కరీంనగర్ పార్లమెంట్ ప్రజల కోసం, కాషాయ జెండాను నమ్ముకున్న నా కార్యకర్తలను గెలిపించడం కోసం ఢిల్లీ ఎన్నికల్లోనే కాదు... గల్లీ ఎన్నికల్లోనూ కొట్లాడేందుకు నేను సిద్ధం. స్థానిక సమరంలో ఈసారి బీజేపీ కొత్త చరిత్రను లిఖించబోతోంది. కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలపై కాషాయ జెండా ఎగరేసి తీరుతాం" అని స్పష్టం చేశారు. ఆసియా కప్, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లలో ఇండియా ఘన విజయం సాధించినట్లుగానే రేపు జరగబోయే కరీంనగర్ పల్లె లీగ్ (కేపీఎల్ లీగ్), సిరిసిల్ల పల్లె లీగ్ (ఎస్పీఎల్) స్థానిక పోటీల్లోనూ బీజేపీ అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న నిఖార్సైన బీజేపీ కార్యకర్తలకే ఈసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో టిక్కెట్లు ఇస్తామని ప్రకటించారు. టిక్కెట్లు ఇవ్వడంతోపాటు గెలిపించుకుని కాషాయ కార్యకర్తల నుదుటిన విజయ తిలకం దిద్దుతామని తెలిపారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడాన్ని భారతీయ జనతా పార్టీ పక్షాన స్వాగతిస్తున్నామన్నారు. నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనా వైఫల్యాలవల్ల స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమైమన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో పంచాయతీలకు నిధులివ్వకపోవడమే కాక అభివృద్ధి పేరుతో నాటి సర్పంచులు చేసిన పనులకు కూడా బిల్లులివ్వకుండా వేధించింది. కేంద్రం నుండి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించింది. కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే రాష్ట్ర ప్రభుత్వం వద్ద పైసల్లేవంటూ స్థానిక సంస్థలకు నిధులివ్వకుండా ఈ పార్టీ చేతులెత్తేసింది. దేశ చరిత్రలో 22 నెలలుగా పంచాయతీలకు నయాపైసా విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది తెలంగాణ మాత్రమే. పంచాయతీ సిబ్బంది జీతాలివ్వడం లేదు. ట్రాక్టర్లకు డీజిల్ పైసలు కూడా ఇయ్యడం లేదు. పంచాయతీల్లో అంతో ఇంతో అభివృద్ధి చెందుతోందంటే ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వమే కారణం. ఏటా క్రమం తప్పకుండా పంచాయతీలకు ఠంచన్ గా నిధులను ఇస్తోంది కేంద్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం మొదలు సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (సీఆర్ఐఎఫ్), ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన దాకా ఈరోజు గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతో చేస్తున్నవేనని, స్థానిక సంస్థల పాలక మండళ్ల గడువు ముగిసి రెండేళ్లు కావొస్తున్నా కాంగ్రెస్ పాలకులు ఎన్నికలను నిర్వహించకపోవడంవల్ల రాజ్యాంగం ప్రకారం కేంద్రం నుండి వచ్చే నిధులు కూడా ఆగిపోయాయి. దీనికి ప్రస్తుత కాంగ్రెస్ పాలకులే కారణం. కేంద్రం నుండి నిధులు ఆగిపోవడంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించి ఆ నిధులు తెచ్చుకోవాలనుకుంటున్నారే తప్ప స్థానిక ఎన్నికలు నిర్వహించి గ్రామాలను, మండలాలను అభివృద్ధి చేసుకుందామనే ఆసక్తి కాంగ్రెస్ పాలకులకు లేనే లేదు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ చేసిన మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఎండగడతాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పల్లెపల్లెకూ వివరిస్తాం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ చేసిన పాపాలను సైతం వివరించి ప్రజల ముందు దోషులుగా నిలబెడతాం. పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మాయ మాటలు నమ్మి గెలిపిస్తే ఈసారి ఊరు వల్లకాడు అవుతుందనే వాస్తవాన్ని ప్రజల ముందుంచుతాం. అదే సమయంలో గ్రామ పంచాయతీలకు మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోపాటు ఆ నిధులవల్ల జరిగిన అభివృద్ధిని సైతం ఇంటింటికీ వివరిస్తాం. ఢిల్లీలోనే కాదు....ఈసారి జరగబోయే ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గల్లీ గల్లీలోనూ కాషాయ జెండా ఎగరేస్తాం. అత్యధిక మండల పరిషత్ పీఠాలతోపాటు కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలను సైతం కైవసం చేసి ఈ కొత్త చరిత్రను లిఖించబోతున్నాం. బీజేపీ పక్షాన నిలబడే అభ్యర్థులను ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలకు నేను చెప్పేదొక్కటే. ఈ ఎన్నికల్లో గెలిచే అవకాశమున్న నాయకులకు మాత్రమే టిక్కెట్లు ఇస్తాం. అభ్యర్థుల ఎంపిక కోసం ఇప్పటికే సర్వే టీంలు ఒక దఫా సర్వే పూర్తి చేశాయి. రిజర్వేషన్లు ఖరారైన నేపథ్యంలో నిన్నటి నుండి సర్వే టీంలు రంగంలోకి దిగాయి. అభ్యర్థుల ఎంపిక విషయంలో పైరవీలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాం. గెలుపే గీటురాయిగా భావించి టిక్కెట్లు ఇస్తాం. పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేస్తున్న నాయకులు కొన్ని చోట్ల గెలిచే అవకాశం లేకపోయినా, రిజర్వేషన్ల మూలంగా టిక్కెట్లు రాకపోయినా నిరాశ చెందవద్దు.



ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO: APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM,

95501 59679, 90001 41919

# ప్రకృతి-సంస్కృతి ప్రతీకగా తెలంగాణ దసరా



భారతదేశం పండుగలతో మమేకమైన తోట. ప్రతి పండుగ ఒక పుష్పం, ప్రతి ఆచారం ఒక పరిమళం, ప్రతి ఆనందం ఒక తేనె చుక్క. ఆశ్వయుజ శుద్ధ దశమి నాడు జరుపుకునే దసరా పండుగ ఆ తోటలో వెలుగురంగుల అద్భుత పువ్వు. దీనిని విజయదశమి అని పిలుస్తారు. "విజయం" అనే పదమే ఈ పండుగలోని మర్మాన్ని తెలియజేస్తుంది. అధర్మం పై ధర్మం సాధించిన జయం, అసత్యం పై సత్యం సాధించిన జయం, చీకటి పై వెలుగు సాధించిన జయం——ఇవన్నీ ఈ పండుగ ఆంతర్యం. తెలంగాణలో దసరా పండుగ ఒక ప్రత్యేకత. ఇక్కడ ఇది కేవలం పూజలతోనే ఆగిపోదు; జానపద గేయాలతో, పూల సౌందర్యంతో, గ్రామీణ జాతరల ఉత్సాహంతో, ప్రకృతి ఆరాధనతో ముడిపడి ఉంటుంది. కవులు చెప్పినట్లుగా——

"దసరా రాకతో పల్లెలో పూలపండుగ పూస్తుంది,
బతుకమ్మ గీతాలతో ఆడిపాడే స్త్రీల హృదయం పులకరించుతుంది."

ఈ పండుగకు పౌరాణిక నేపథ్యం విశిష్టమైనది. మహిషాసుర మర్దినిగా దుర్గాదేవి తొమ్మిది రోజుల యుద్ధం చేసి, దశమి నాడు విజయం సాధించింది. శ్రీరాముడు రావణుని సంహరించి లంకపై విజయకేతనం ఎగరేశాడు. పాండవులు అజ్ఞాతవాసం పూర్తిచేసి జమ్మిచెట్టుపై దాచిన ఆయుధాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ గాథలు ఒకే సందేశాన్ని ఇస్తాయి——ధర్మమే చివరికి గెలుస్తుంది.

తెలంగాణలో దసరా పండుగ బతుకమ్మ పూలపండుగతో ముడిపడి ఉంటుంది. స్త్రీలు తమ చేతులారా పూలతో చేసిన బతుకమ్మను ఆడుతూ పాడుతూ గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్తారు. పూల పరిమళం, జానపద గేయాల సౌరభం, స్త్రీల సమూహ నృత్యం అన్ని కలసి ఒక అద్భుత దృశ్యాన్ని సృష్టిస్తాయి. బతుకమ్మ అనేది తెలంగాణ స్త్రీల సృజనాత్మకతకు, వారి భక్తికి ప్రతీక. ఒక జానపద గీతంలో స్త్రీలు ఇలా పాడతారు——

"బతుకమ్మ పూలకోసమే బతికిన స్త్రీల మమకారం,
దసరా వెలుగులకోసమే కలసిన గుండెల ఆనందం."

దసరాలో జమ్మిచెట్టు పూజ ఒక ముఖ్యమైన ఆచారం. పాండవులు తమ ఆయుధాలను జమ్మిచెట్టుపై దాచిన కథ అందరికీ తెలిసిందే. జమ్మి ఆకులను "బంగారు ఆకులు"గా పరిగణించి పరస్పరం పంచుకోవడం ఐశ్వర్యానికి, స్నేహబంధానికి సంకేతం. ఒక జానపద పద్యం చెబుతుంది——

"జమ్మి ఆకు పంచితే బంగారు బంధం బలపడుతుంది,
ఆ బంగారు ఆకులో స్నేహం పసిడి మెరిసిపోతుంది."

అయితే ఈ పండుగలో అత్యంత విశిష్టమైన ఆచారం పాలపిట్ట దర్శనం. విజయదశమి రోజున పాలపిట్టను చూడటం శుభప్రదం అని ప్రజలు నమ్ముతారు. పాలపిట్టను చూసినవారికి సుఖసమృద్ధులు లభిస్తాయని విశ్వాసం. చిన్నారులు, మహిళలు ముఖ్యంగా పాలపిట్ట కోసం ఎదురు చూస్తారు. దర్శనమైన వెంటనే ఉత్సాహంగా ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుతారు. ఈ ఆచారం కేవలం ఒక మూఢనమ్మకం కాదు; ఇది ప్రకృతితో మానవ సంబంధాన్ని బలపరిచే జానపద విశ్వాసం.

తెలంగాణ జానపద గేయాలలో పాలపిట్ట ప్రస్తావన తరచుగా వస్తుంది. ఒక గీతంలో ఇలా పాడతారు——

"పాలపిట్ట పరిగెత్తింది పొలాల మీదుగా,
దాని చూపు చూడగానే హృదయం పరవశమైంది."

పక్షులు ఎప్పుడూ ప్రజలలో శకునాలుగా, దైవసూచనలుగా పరిగణించబడ్డాయి. కోయిల కూయడం వసంతాన్ని సూచిస్తే, కాకి కేకలు అతిథుల రాకను సూచిస్తాయి. ఇదే తరహాలో పాలపిట్ట దర్శనం సుభిక్షానికి సంకేతంగా భావించడం ప్రజల లోక జ్ఞానానికి ఉదాహరణ. ఇది ఫోక్ ఎకాలజీకి ఒక ప్రతీక. ప్రకృతి కదలికలు, పక్షుల సంచారం అన్ని ప్రజల దైనందిన జీవితంలో భాగమైపోయాయి.

పాలపిట్ట దర్శనం పర్యావరణ సంరక్షణకూ పునాది. ఒక పక్షిని పవిత్రంగా భావిస్తే దానిని హానిచేయకుండా కాపాడతారు. జానపద విశ్వాసాలు కూడా జీవవైవిధ్యాన్ని కాపాడటంలో ఒక సాంస్కృతిక ఆయుధంలా పనిచేస్తాయి. మనిషి ప్రకృతితో మమేకమై, పక్షులను దైవరూపాలుగా పూజించాడంటే అది ఒక పర్యావరణ సందేశమే. కవులు కూడా పక్షుల గానాన్ని, వారి కదలికలను కవిత్వంలో ఆరాధించారు. పాలపిట్టను చూసి "శాంతి, సుభిక్షాల రాక"ని కవులు పలుమార్లు పేర్కొన్నారు.

దసరా సమయంలో ఊరేగింపులు, జాతరలు గ్రామీణ జీవితానికి ఉత్సాహం తెస్తాయి. పోలేరమ్మ, మైసమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మ వంటి గ్రామదేవతల పూజలు జరుగుతాయి. గ్రామం మొత్తం ఒకచోట చేరి దప్పు వాయిద్యాలు, జానపద నృత్యాలు చేస్తూ ఉత్సవం జరుపుకుంటుంది. ఈ సందర్భాల్లో జానపద గాయకులు తమ ప్రతిభను ప్రదర్శిస్తారు. "దసరా రాగమై డప్పులో మార్మోగింది" అని ఒక కవి అన్నట్టుగా, ఈ ఉత్సవం డప్పుల నినాదంలో ప్రతిధ్వనిస్తుంది.



- డా. ఇడికోజు శ్రీనివాసాచారి
9885349305

ఆధ్యాత్మిక దృక్పథంలో దసరా రోజున ఆయుధపూజ, వాహనపూజ చేయడం సంప్రదాయం. రైతులు పంట పరికరాలను పూజిస్తారు. వ్యాపారులు ఖాతా బహీని పూజించి కొత్త లెక్కలు ప్రారంభిస్తారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుడుతారు. గురువులను పూజించి వారి ఆశీస్సులు తీసుకోవడం అనివార్యమైన ఆచారం. ఇవన్నీ ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు ప్రాయోజనాత్మక దృక్పథాన్ని కలిపినవి. సామాజికంగా దసరా ప్రజలలో ఐక్యతను పెంపొందిస్తుంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులందరు కలసి పండుగ జరుపుకోవడం వలన బంధాలు బలపడతాయి. బతుకమ్మలో స్త్రీలు ఆడే నృత్యాలు, పాడే గేయాలు స్త్రీల భావోద్వేగాలను ప్రతిబింబిస్తాయి. జమ్మి ఆకులు పంచుకోవడం స్నేహ బంధాలను బలపరుస్తుంది. పాలపిట్ట దర్శనం పంచుకున్న ఆనందం సమాజాన్ని ఉత్సాహపరుస్తుంది. ఆర్థికంగా ఈ పండుగ పల్లెల్లో వ్యాపారాన్ని పెంచుతుంది. పూల వ్యాపారం, బట్టల కొనుగోలు, ఆటబొమ్మల అమ్మకాలు——అన్ని ఈ సమయంలో పెద్ద ఎత్తున జరుగుతాయి. కళాకారులు, డప్పు వాయిద్యకారులు, జానపద గాయకులు ఉపాధి పొందుతారు. జానపద కళాకారులు దసరా సమయానికే ఆశతో ఎదురుచూస్తారు. ఆధునిక కాలంలో కూడా ఈ పండుగ తన విశిష్టతను కోల్పోలేదు. పట్టణాల్లో బొమ్మల కొలువులు, వాహనపూజలు, జమ్మి ఆకుల పూజ——అన్ని కొనసాగుతున్నాయి. విద్యాసంస్థల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. పత్రికలు, టెలివిజన్, సోషల్ మీడియా వలన బతుకమ్మ-దసరా ఉత్సవాలు అంతర్జాతీయ గుర్తింపును పొందాయి. విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలు కూడా ఈ పండుగను గర్వంగా జరుపుకుంటున్నారు. మొత్తానికి తెలంగాణ దసరా పండుగ కేవలం ధార్మిక ఆచారం మాత్రమే కాదు. అది ప్రజల జీవన విధానంలో బలమైన స్థానాన్ని సంపాదించుకున్న ఒక సామాజిక-సాంస్కృతిక ఉత్సవం. మహిళల బతుకమ్మ పూలపండుగ, జమ్మిచెట్టు పూజ, పాలపిట్ట దర్శనం——అన్ని కలిపి తెలంగాణ జీవనశైలికి ప్రతీకలు. పాలపిట్ట దర్శనం ప్రకృతి పట్ల గౌరవాన్ని, పర్యావరణ సంరక్షణను ప్రతిబింబిస్తే, జమ్మిచెట్టు పూజ స్నేహబంధాలను బలపరుస్తుంది. ఊరేగింపులు, జాతరలు గ్రామీణ జీవితాన్ని సజీవం చేస్తాయి. అధర్మం పై ధర్మానికి, అసత్యం పై సత్యానికి, చీకటి పై వెలుగుకు కి జయాన్ని సూచించే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి చిరస్మరణీయమైన చిహ్నం. ప్రకృతి-సంస్కృతి-సమాజ సమ్మేళనంగా నిలిచిన ఈ పండుగలో పాలపిట్ట దర్శనం ఒక ప్రత్యేక ఆచారం మాత్రమే కాదు; అది మనిషి-ప్రకృతి అనుబంధానికి, పక్షుల ఆరాధనకు, పర్యావరణ సంరక్షణకు ప్రతీక. కవులు చెప్పినట్టుగా—— "దసరా వేడుకలో పాలపిట్ట చూపు గనక,ఆ చూపే సుభిక్షానికి చిహ్నం, శాంతికి పతాక."ఇదే తెలంగాణ దసరా వైభవం, ఇదే పాలపిట్ట దర్శనం విశిష్టత.

రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# విజయాలను చేకూర్చే విజయదశమి



హిందువుల ముఖ్యమైన పండుగలలో దసరా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న పండుగ. ఇది చెడుపై మంచి సాధించిన విజయానికి సూచిక. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు అత్యంత వైభవోపేతంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు జరిపి పదవ రోజు దశమి తిథినాడు "విజయదశమి" పండుగ జరుపుకుంటారు. ఈ పది రోజుల వేడుకలనే దసరా సంబరాలని కూడా అంటారు. ఈ పండుగ దుర్గాదేవి ఆరాధనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే పండుగ. ఆశ్వయుజ పాడ్యమి నుండి శరత్ ఋతువు ప్రారంభంతోనే ఈ ఉత్సవాలు మొదలౌతున్నందున ఈ నవరాత్రులను శరన్నవరాత్రులని కూడా పిలుస్తారు. ఈ సంవత్సరం తిథులలో వృద్ధి వలన పదకొండు రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. గ్రామాలలో, పట్టణాలలో భక్తులు దేవీ ప్రతిమలను ప్రతిష్టించి చతుష్షష్టి పూజలతో వైభవంగా వేడుకలు జరుపుతున్నారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారు ప్రతిరోజు ఒక రూపంలో నవరాత్రులలో భక్తులచే పూజలను అందుకుంటారు. నవరాత్రుల మొదటిరోజు భక్తులు అమ్మవారిని శ్రీ బాలా త్రిపురసుందరీ అవతారంలో గులాబీ రంగు చీరతో అలంకరించి, పరమాన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. రెండవ రోజు శ్రీ గాయత్రీదేవి రూపంలో నారింజరంగు చీరతో అలంకరించి, కొబ్బరి అన్నం గారెలు నైవేద్యం పెడతారు. మూడవ రోజు శ్రీ అన్నపూర్ణా దేవి రూపంలో నీలిరంగు చీరతో అలంకరించి మినుప వడలు, పులిహోర సమర్పిస్తారు. నాలుగోరోజు శ్రీ కాత్యాయని రూపంలో పసుపు రంగు చీరను అలంకరించి పాయసం రవ్వ కేసరిని నివేదిస్తారు. ఐదవ రోజు శ్రీ మహాలక్ష్మీ దేవీ రూపంలో గులాబీ రంగు చీరను అలంకరించి పూర్ణాలు, రవ్వ కేసరిని నైవేద్యం పెడతారు. ఆరో రోజు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో పసుపు రంగు చీరను అలంకరించి రవ్వ కేసరి పాయసం నివేదిస్తారు. ఏడో రోజున శ్రీ మహాచండీ దేవి రూపంలో బంగారు రంగు చీరను అలంకరించి పొంగలిని, మూలా నక్షత్రం రోజు శ్రీ సరస్వతీ దేవి రూపంలో తెలుపు రంగు చీరను అలంకరించి పాయసం, శాకాన్నమును, దుర్గాష్టమి రోజున ఎరుపు రంగు చీరతో అలంకరించి నైవేద్యంగా కదంబాన్ని సమర్పిస్తారు. మహర్నవమి రోజున మహిషాసుర మర్ధిని రూపంలో నీలిరంగు చీరతో అలంకరించి, చక్కెర పొంగలిని, చివరి రోజైన విజయదశమి నాడు శ్రీ రాజరాజేశ్వరీ దేవి రూపంలో ఆకుపచ్చ రంగు చీరను అలంకరించి దద్దోజనం, మహా నైవేద్యం అమ్మవారికి భక్తితో సమర్పిస్తారు. ఈ విధంగా నవ రాత్రులు, పది రోజులు అమ్మవారికి విశేషపూజలు చండీ హవనం పూర్తిచేసిన తదుపరి చివరి రోజు పూర్ణాహుతితో నవరాత్రి పూజలు పూర్తవుతాయి

## పండుగ నేపథ్యం:

జగన్మాత దుర్గాదేవి మహిశాసురుడనే రాక్షసుడితో తొమ్మిది రోజులు యుద్ధం చేసి, పదవ రోజు ఆ రాక్షసుడిని సంహరించిన సందర్భంగా తొమ్మిది రోజులు నవరాత్రులు జరిపి పదవ రోజు దుర్గాదేవి విజయం పొందిన రోజు కనుక ఈ పండుగ విజయదశమిగా ప్రాశస్త్యం పొందిందని ఒక కథనం. కాగా మహా భారత కాలంలో పాండవులు అజ్ఞాత వాసానికి ముందు శమీ వృక్షంపై తమ ఆయుధాలను దాచి, అజ్ఞాతవాసం తదుపరి దసరా పండుగ రోజున శమీ వృక్షాన్ని, ఆయుధాలను పూజించి తిరిగి వాటిని ధరించినందున అప్పటి నుండి ప్రజలు కూడా ప్రతి దసరా పండుగ నాడు తమ ఇళ్ళలోగల ఆయుధాలు, వాహనాలు, యంత్రాలకు పూజలు చేసి, సాయంత్రం ఊరు బయటకు వెళ్ళి శమీ వృక్షాన్ని దర్శించుకుని పూజలు, ప్రదక్షిణలు చేసిన అనంతరం ఆ శమీ చెట్టు ఆకులను స్వీకరిస్తారు. ఇంటికి చేరాక భక్తితో దేవుళ్ళకు కొన్ని సమర్పించి తదుపరి పెద్దలకు బంగారం పేరుతో ఇచ్చి కాళ్ళకు నమస్కరించి వారి ఆశీస్సులు తీసుకుంటారు. స్నేహితులకు ఇచ్చి ఆనందంతో ఆలింగనం చేసుకోవడం అనాదిగా ఇక్కడ ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఇక విజయదశమి రోజు ఏ పనిని ప్రారంభించినా తప్పకుండా విజయం చేకూరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. చాలావరకు నూతన గృహాలు, వ్యాపారాలు, వృత్తి, ఉద్యోగాలు ఈరోజునే ప్రారంభిస్తుంటారు. దేశమంతా హిందువులు జరుపుకునే ఈ దసరా పండుగ తెలుగు రాష్ట్రాలు ముఖ్యంగా తెలంగాణ ప్రజలు భక్తి ప్రపత్తులతో ఘనంగా జరుపుకుంటుంటారు. ఈ సంవత్సరం అత్యంత వైభవంగా ప్రారంభమైన దేవీ నవరాత్రుల ఉత్సవాలు గురువారం విజయ దశమి పండుగతో ముగియనున్నాయి.

- నాగరాజు కామర్సు, 92480 93580



# చరిత్రగా మిగిలిపోనున్న మిగ్ యుద్ధ విమానాలు

భారతదేశ రక్షణ చరిత్రలో మిగ్ సిరీస్ యుద్ధ విమానాలు ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి. "మిగ్21" అనగానే భారతీయ వైమానిక దళం గుర్తుకు వస్తుంది. 1960ల నుండి 2020ల వరకు ఈ విమానాలు దేశ భద్రతలో కీలక పాత్ర పోషించాయి. అయితే కాలానుగుణంగా సాంకేతికత అభివృద్ధి చెందుతూ ఉండటంతో, ఆధునిక యుద్ధ అవసరాలను తీర్చలేకపోవడం వల్ల మిగ్ విమానాలకు భారత్ చివరికి గుడ్‌బై చెప్పింది. ఈ నిర్ణయం ఒకవైపు చారిత్రకమైనదైతే,మరోవైపు కొత్త సాంకేతిక శక్తికి దారితీసే ఒక ముందడుగు.1962 చైనా యుద్ధం తరువాత భారత వైమానిక దళానికి ఆధునిక యుద్ధ విమానాల అవసరం పెరిగింది. అప్పుడు సోవియట్ యూనియన్ నుండి భారత్ "మిగ్21"ను సంపాదించింది. 1963లో మొదటి మిగ్21 విమానం భారత్‌లో దిగింది. ఆ తర్వాత హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఈ విమానాలను దేశీయంగా తయారు చేసింది. పాకిస్తాన్‌తో జరిగిన 1965, 1971 యుద్ధాలలో మిగ్‌లు ధైర్యాన్ని చూపించాయి. ప్రత్యేకించి 1971లో బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో మిగ్‌లు భారత విజయంలో కీలక పాత్ర పోషించాయి.మిగ్‌లు చరిత్రలో గౌరవం సంపాదించుకున్నప్పటికీ, తరచుగా జరిగే ప్రమాదాల కారణంగా విమానాలను "ఫ్లైయింగ్ కాఫిన్" అని పిలిచేవారు. ఆధునిక యుద్ధ సాంకేతికత లేకపోవడం, పైలట్లకు శిక్షణలో ఎదురయ్యే కఠినత, పాత ఇంజన్లు వంటి కారణాలతో మిగ్‌లపై విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ భారత్ తన సైనిక బలాన్ని నిలబెట్టుకోవడానికి ఈ విమానాలను ఉపయోగించాల్సి వచ్చింది.21వ శతాబ్దం రాకతో యుద్ధ వ్యూహాలు, సాంకేతిక పరిజ్ఞానం పూర్తిగా మారి పోయాయి. రాఫెల్, సుఖోయ్, తేజస్,అమ్కా వంటి ఆధునిక యుద్ధ విమానాలు కొత్త తరం అవసరాలకు తగినవిగా ఉన్నాయి. దీంతో మిగ్‌ల అవసరం తగ్గింది. 2025 నాటికి చివరి మిగ్ స్క్వాడ్రన్‌ను కూడా రిటైర్ చేస్తూ భారత్ ఒక కొత్త అధ్యాయం మొదలు పెట్టింది. ఇది భారత వైమానిక దళానికి చారిత్రక మలుపు.మిగ్‌ల విరమణతో భారత్ ఆధునిక యుద్ధ సిద్ధతను మరింత బలోపేతం చేసింది. ఇప్పుడు భారత్ శత్రువులను ఎదుర్కోవడానికి రాఫెల్ వంటి 4.5 తరం యుద్ధ విమానాలు, సుఖోయ్30 ఎం కే ఐ వంటి శక్తివంతమైన జెట్‌లు, అలాగే స్వదేశీ తేజస్ పై ఆధారపడుతోంది. ఇది "ఆత్మనిర్భర్ భారత్" లక్ష్యానికి దగ్గరగా తీసుకెళ్తోంది. మిగ్‌ల నుంచి ఆధునిక విమానాలకెళ్లడం ద్వారా భారత రక్షణ రంగం గ్లోబల్ స్థాయిలో పోటీ పడే స్థితికి వచ్చింది.మిగ్21లు అనేక యుద్ధాల్లో భారత త్రివర్ణ పతాకాన్ని గర్వంగా ఎగరేశాయి. అయితే ప్రతి యుగానికి ఒక ముగింపు ఉంటుంది. ఇప్పుడు మిగ్‌ల విరమణతో కొత్త సాంకేతికత, ఆధునిక శక్తి, భవిష్యత్ రక్షణ అవసరాలకు తగిన యుద్ధ విమానాలపై భారత్ దృష్టి పెట్టింది. ఈ నిర్ణయం గతానికి గౌరవం తెలుపుతూ, భవిష్యత్తుకు ముందడుగు వేసిన సంకేతంగా నిలుస్తుంది.



- పిన్నింటి బాలాజీ రావు
98667 76286

# సరస్వతి మాత రూపంలో అమ్మవారు దర్శనం



**రాజేంద్రనగర్ మహా ;** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ శ్రీ పోచమ్మ దేవాలయంలో దేవి శరన్నవరాత్రి సందర్భంగా సరస్వతి మాత అలంకారంలో దర్శనం ఇచ్చారు. సోమ శ్రీనివాస్ గుప్తా, శంకర్ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు సరస్వతి మాత రూపంలో ఉన్న అమ్మవారి చెంత అక్షర అభ్యాసం నిర్వహించారు. స్కూల్ పిల్లల కు నోట్ బుక్స్ పెన్నులు పలకలు సోమ శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షులు శంకర్, మల్లేష్ పోతురాజు, సందుల హనుమంత్ , వెంకటేష్, కిషోర్, సందీప్, భరత్ పంతులు, బాబ్యా తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాతకు ప్రత్యేక పూజలు



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం కట్టపై ఉన్న కట్ట మైసమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారికి ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణ శ్రీ దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు మొక్కల బాలమణి వెంకటయ్య ఆధ్వర్యంలో సర్పంచును ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు సర్పంచ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలలో మాజీ వార్డు సభ్యులు ఎర్రవోలు రాజు, కండె భాస్కర్, మల్లేష్ నాయక్, శ్రీను నాయక్, గంజి వెంకటేష్, కొప్పు బొందాల మహేష్ తదితరులు పాల్గొన్నారు

# 30 ఏళ్ల తరువాత అపూర్వ కలయిక

**అందరిలో ఒక్కడిగా రాష్ట విద్య కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్**



**ఆమనగల్లు, మహా:** ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఉన్నత పాఠశాల) 10వ తరగతి199596 బ్యాచ్ కు చెందిన దాదాపు 65 మంది విద్యార్థులు 29 ఏళ్ల తరువాత మైసిగండిలో కలుసుకున్నారు. ఒక్కరిని ఒక్కరు ఆప్యాయతతో పలకరించకుంటూ.. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. చదువు చెప్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. కొందరు ఉపాధ్యాయులు, కొందరు తోటి మిత్రులు మృతి చెందడం పై విచారం వ్యక్తం చేసి, వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఆనాటి చిలిపి చేష్టలు, ఆడిపాడిన మధుర జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. అందరిలో ఒక్కడిగా తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ కలిసిపోయి, చిన్ననాటి మిత్రులతో సరదా కబుర్లు చెప్పుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని కొంత భావోద్వేగానికి గురయ్యారు. దాదాపు 30 ఏళ్ల క్రితం విడిపోయి, నేడు కలవడం నాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మనతో చదువుకున్న మిత్రులు కొందరు లేరన్న విషయం చాలా బాదేసిందన్నారు. డిగ్రీ, పీజీ, పి హెచ్ డి మిత్రుల కలయిక కన్నా, 10వ తరగతి మిత్రులు కలిస్తే కలిగే ఆనందం చెప్పలేనిదన్నారు. ఇప్పటి నుంచి ప్రతి ఏటా కలుసుకునే విధంగా చూడాలని, వీలు పడితే కుటుంబ సభ్యులతో కలవడానికి ప్రయత్నం చేద్దాం అన్నారు. విద్య కమిషన్ సభ్యులుగా నాకున్న అవకాశంతో మన మిత్రుల పిల్లల చదువు విషయంలో ఏమైనా సహాయ సహకారాలు అందించడానికి నావంతుగా సిద్ధంగా ఎప్పుడు ఉంటానన్నారు. దాదాపు ఏడాదిగా ముగ్గురు నలుగురు మిత్రులు కృషి చేసి, ఇంత మంది మిత్రులను ఒక చోటుకు చేర్చిన వారికి మాస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నన్నారు. విద్య కమిషన్ సభ్యులుగా నియమితులైన చారకొండ వెంకటేష్‌ను మిత్రులు శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్ప గుచ్చం అందజేసి, అభినందనలు చెప్పారు. వెంకటేష్ ప్రతి ఒక్కరిని శాలువాతో సత్కరించి, పేరు పేరునా పలికించారు. అనంతరం చారకొండ వెంకటేష్ చిన్ననాటి మిత్రులతో కలిసి ఆడి, పాడారు. ఈ కార్యక్రమంలో కోలుకులపల్లి యాదయ్య, రాఘవేందర్, బాలస్వామి (బాలు), బొల్లంపల్లి ఆంజనేయులు, బి.చంద్రయ్యా, బాల్ రాజ్, పి.జంగయ్య, బాలయ్య, కిరణ్, వెంకట్ రెడ్డి, కృష్ణా రెడ్డి, సుల్తాన్, గఫార్, శ్రీను, అచ్చయ్య, దాస్య నాయక్ పాల్గొన్నారు.

# అన్నదానం - మహాదానం




**ఆమనగల్లు, మహా:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు బాలాజీ నగర్ క్లబ్లో ఆధ్వర్యంలో కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని మాజీ గవర్నర్ జి చెన్నకేశవరెడ్డి ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ జవాఅధ్యక్షతన జరిగిన సమావేశంలో చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు సేవే లక్ష్యంగా పనిచేస్తున్న లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగలు అంతర్జాతీయ స్థాయిలోనే అగ్ర భాగాన నిలిచింది అని చెన్నకేశవరెడ్డి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యకమాలను ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 450 మందికి అన్నదానం చేసినట్లు క్లబ్ పి ఆర్ ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కె గోవర్ధన్ రెడ్డి, క్లబ్ కార్యదర్శి గంపశ్రీను, క్లబ్ సభ్యులు పిప్పల్ల వెంకటేష్, చేగురి వెంకటేష్, రాజేందర్, బిచ్య నాయక్, లక్ష్మయ్య, క్లబ్ పి ఆర్ ఓ పాషా తదితరులు పాల్గొన్నారు

# ఆమనగల్లు లయన్స్ క్లబ్ అవార్డుల పంట

- **అత్యుత్తమ క్లబ్ గా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు**
- **ఉత్తమ అధ్యక్షునిగా లయన్ పసుల లక్ష్మారెడ్డి**




**ఆమనగల్లు, మహా :** లయన్స్ క్లబ్ జిల్లా (320A) గవర్నర్ 2024 2025 సంవత్సరానికి డాక్టర్ డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో లక్ష్మి కన్వెక్షన్ హాల్ కర్మాంగట్ డిస్టిక్ అవార్డ్స్ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 92 క్లబ్బులలో అత్యుత్తమ క్లబ్ గా నిలిచిందని క్లబ్బు పిఆర్ఓ ఎంఎ పాషా తెలిపారు. 2024 25 సంవత్సరంలో క్లబ్ అధ్యక్షులు లయన్ పసుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఆయనకు ఉత్తమ అధ్యక్షునిగా అవార్డు దక్కిందని క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు కు లైన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ వి దామోదర్ రెడ్డి గారి వైద్య బృందం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా హెల్త్ శిబిరాలకు అవార్డు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎల్ సి ఐ ఎఫ్ ఏరియా లీడర్ మాజీ గవర్నర్ జి చెన్నకేశవరెడ్డి గారి ఆధ్వర్యంలో చేపట్టే మీల్స్ అండ్ మిల్స్ అవార్డు, ఎం జె ఎఫ్ అవార్డు,సభ్యత్వ నమోదు అవార్డు, పర్మినెంట్ ప్రాజెక్టులకు అవార్డు, బెస్ట్ లీయో క్లబ్ గా అమంగల్ నిలిచిందని క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ చేపట్టిన 2024 25 సంవత్సరానికి గాను చేపట్టిన కార్యక్రమాలకు సహకరించిన క్లబ్బు సభ్యులకు క్లబ్బు మాజీ అధ్యక్షులు లయన్ పసుల లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి మహేందర్ కుమార్ రెడ్డి, మాజీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ సునీల్ కుమార్, ఫస్ట్ వైస్ గవర్నర్ సురేష్ జగ్నని,సెకండ్ వైస్ గవర్నర్ శశికాంత్,లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జి చెన్నకేశవరెడ్డి,సందడి నరేందర్ రెడ్డి,జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, జిల్లా చైర్మన్ జూలూరు రమేష్, క్లబ్ సభ్యుల గుజ్జరి నరసింహ, కండె సత్యం,మిట్టపల్లి అంజయ్య, రిజియన్ చైర్మన్ సంపతి జనార్దన్ రెడ్డి క్లబ్ పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో రెండు విడతలలో ఎన్నికలు..!

**జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా మహా:** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని, సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని, ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా జిల్లాలో రెండు విడతలలో నిర్వహించేందుకు జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమిస్తూ, వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉందని, షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిన దృష్ట్యా పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకున్నామని, ఎంపీటీసీ, జెడ్పిటిసి బ్యాలెట్లను కట్టుదిట్టమైన నిఘాను కొనసాగిస్తామని అన్నారు. స్థానిక ఎన్నికలను ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశంలో ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను, సర్పంచ్ ఎన్నికలను రెండు విడతలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 9 వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, అక్టోబర్ 9 నుంచి 11 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్, అక్టోబర్ 13 నుంచి15 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ రెండో విడత పోలింగ్ ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 17న సర్పంచ్ ఎన్నికలకు తొలి విడత నోటిఫికేషన్ జారీ, అక్టోబర్ 17 నుంచి 19 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 31న సర్పంచ్ ఎన్నికలకు తొలి విడత పోలింగ్, అక్టోబర్ 21 నుంచి 23 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, నవంబర్ 4 న సర్పంచ్ ఎన్నికలకు రెండో విడత పోలింగ్ ఉంటుందని తెలిపారు. స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని, ఎం.సి.సి. నియమావళిని పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల విధులలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# యువత స్వయం ఉపాధితో రాణించాలి :ఆచారి

**ఆమనగల్లు, మహా:** యువత స్వయం ఉపాధితో ముందుకు రాణించాలని మాజీ జాతీయ ఉపాధి కమిషన్ సభ్యులు తల్లో జు ఆచారి అన్నారు. సోమవారం ఆమనగల్లు మండల మండల కేంద్రంలో శెట్టిపల్లి గ్రామానికి చెందిన రమేష్ గౌడ్ ఏర్పాటు చేసిన నూతన తేజశ్రీ ఫ్రెష్ చికెన్ షాప్ ను తల్లోజు ఆచారి హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని షాపు యజమానిని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యువత ఎవరి పై ఆధారపడి ఉండకుండా స్వయం ఉపాధి ఎన్నుకొని తమ కాళ్ళ పై తాము నిలబడి తమ కుటుంబాన్ని పోషించి సమాజం మంచి విలువలతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు శ్రీపాతి శ్రీనివాసరెడ్డి, కండె హరిప్రసాద్, అప్పం శ్రీను, గోరటి నర్సింహ, యువ నాయకులు రాకేష్ రావు, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పాల్గొన్నారు



**అమ్మవారి ఆలయంలో చిన్నారులకు**

# పాఠ్యపుస్తకాలు

**కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్ మహా ;** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బిజెపి రాజేంద్రనగర్ ఇంచార్జ్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి మైలార్దేవ్పల్లి డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలోని దుర్గామాత అమ్మవారి దేవాలయంలో కమిటీ సభ్యులతో కలిసి 8వ రోజు శ్రీ సరస్వతి దేవి రూపంలో అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం కోసం పాఠ్య పుస్తకాలు పలకలను అందజేశారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ దేవి శరన్నవరాత్రి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో అమ్మవారి చల్లని దీవెనలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు డివిజన్లోని ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు




# వైన్స్ షాపులకు ఎక్సైజ్ శాఖ సూచనలు

- **దసరా రోజున వైన్ షాపులు బంద్**
- **ఆమనగల్లు సర్కిల్ ఎక్సైజ్ సిఐ బద్యనాథ్ చౌహాన్**

**ఆమనగల్లు, మహా :** తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పండుగ దసరా ఈ సంవత్సరం అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున రావడం జరిగింది. కానీ జాతిపిత అక్టోబర్ రెండవ తేదీన మద్యం షాపులు మూసివేయాల్సిందేనని ఆమనగలు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఆమనగల్లు, కడ్తాల్,తలకొండపల్లి,మాడుగుల మండలంలోని వైన్ షాపు నిర్వాహకులు షాపుల వద్ద దసరా రోజున వైన్ షాప్ లు బంద్ అంటూ ఫ్లెక్సీలు ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను వ్యతిరేకిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మోసపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- **అబద్ధాల కాంగ్రెస్ కు కాలం చెల్లింది**
- **హామీలను నెరవేర్చాలని అడిగితే నిర్దాక్షిణ్యంగా అణచివేత**
- **జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా మహా:** మోసపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. అబద్ధాల కాంగ్రెస్ కు తగురీతిలో బుద్ధిచెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ఉద్ఘాటించారు. సోమవారం జరిగిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ఆవేధన చెందుతున్నారని చెప్పారు. అన్ని వర్గాలకు మేలు చేసిన కేసీఆర్ ను కాదనుకుని, కాంగ్రెస్ పార్టీని నమ్మిన ప్రజలు తాము మోసపోయామని గ్రహించారని అన్నారు. రైతులు, కూలీలు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు తమకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే పోలీసులతో నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు యేడాదిలో భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే నిరుద్యోగులను నిలువునా వంచించారని విమర్శించారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఇంటింటికి వెళ్లి గుర్తు చేయవలసిన బాధ్యత బిఆర్ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. సమర్థులైన నాయకులను , పార్టీ కోసం ప్రజల కోసం పనిచేసే వారిని స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులుగా నిలబెట్టి గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# రేగొండలో నూతన బస్టాండ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్



**భూపాలపల్లి, మహా :** రేగొండ గ్రామంలో రూ.370 లక్షలతో నూతనంగా నిర్మించనున్న బస్టాండు నిర్మాణ పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... రేగొండ మండల కేంద్రంలో నియోజకవర్గ ప్రజల రవాణా సౌకర్యార్థం నూతన బస్టాండ్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రేగొండ మండల కేంద్రం పరకాల, భూపాలపల్లి, ములుగు, చిట్యాల, టేకుమట్ల పట్టణాలకు కేంద్ర బిందువుగా ఉందన్నారు. రేగొండ నుండి వివిధ ప్రాంతాలకు నిత్యం ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారన్నారు. అదేవిధంగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అరగంటలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ఇప్పటివరకు రూ.186 కోట్ల జీరో టికెట్లు జారీ చేయగా, ఆర్థిక శాఖ ఆర్టీసీకి రూ.6,210 కోట్లు చెల్లించిందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

**యువత స్వయం ఉపాధి ఎంచుకోవాలి : ఎమ్మెల్యే**

యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. సోమవారం రేగొండ మండలంలో నిరుద్యోగ యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా బలపడాలని ఎమ్మెల్యే సూచించారు. యువత స్థానికంగా వ్యాపార కేంద్రాలను ఆరంభించి ప్రజాసేవ చేస్తూ, ఉపాధి పొందాలని సూచించారు. యువత స్వయం ఉపాధి అవకాశాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తాము ఉపాధి పొందడంతో పాటు మరో పది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నాణ్యమైన సేవలతో వినియోగదారుల మన్ననలను పొందాలన్నారు. భూపాలపల్లి, పరకాల పట్టణాలతో పాటు చుట్టుపక్కల ఉన్న కొత్తపల్లిగోరి, చిట్యాల, టేకుమట్ల మండల కేంద్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న రేగొండ మండల కేంద్రం శరవేగంగా అన్ని వ్యాపారాలకు అనువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.



# ప్రజా సంక్షేమానికి అనేక పథకాలు అమలు

- **సీఎం సహాయనిది పేదలకు వరం**
- **కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా మహా:** సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మంచాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వింజమూరి రాంరెడ్డి అన్నారు. సోమవారం మంచాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బైరిక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, ఎడమ నరేందర్ రెడ్డి, జెనిగ వెంకటేష్ యాదవ్, పెర్క మూర్తి, మోహన్ నాయక్, రాందాస్ నాయక్, గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, పాండాల యాదయ్య గౌడ్, చేతాళ్ళ సతీష్, లక్ష్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ఇద్దరు ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్సైల బదిలీలు

**వరంగల్ హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్స్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో పోలీస్ కంట్రోల్ రూం ఇన్స్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న డి. విశ్వేశ్వర్ ను గీసుగొండ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయగా ఇదే పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఏ. మహేందర్ ను పోలీస్ కంట్రోల్ రూం ఇన్స్ స్పెక్టర్ గా బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ఇన్స్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ని ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో టాస్క్ ఫోర్స్ ఎస్.ఐ గా విధులు నిర్వహిస్తున్న కె. వంశీ కృష్ణ ను సంగెం పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయగా అదే పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎల్. నరేష్ ను మీల్స్ కాలనీ ఎస్ ఐగా బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ప్రహరి గోడ పనులను త్వరగా పూర్తి చేయండి



**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**హన్మకొండ మహా;** ప్రహరీ గోడ నిర్మిత పనులను త్వరగా పూర్తిచేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హన్మకొండ లోని వెహికల్ షెడ్ ప్రాంతం లో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మిత పనులతో పాటు సమీపం లో గల రెండు పడకల గదులు సముదాయం (2 బి హెచ్ కే) లో నీటి సరఫరా వసతి కల్పన కోసం చేయాల్సిన ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హన్మకొండలోని బాల సముద్రం లో గల వెహికల్ షెడ్ ప్రాంతంలో బల్దియా నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు అనంతరం అదే ప్రాంతం లో గల రెండు పడకల గదులు సముదాయం లో క్షేత్ర స్థాయిలో సందర్శించి ప్రస్తుతం నివాసం ఉంటున్న వారికి నీటిని వినియోగించుకోవడానికి వీలుగా సంయుక్తం గా సంప్ ఉందని అట్టి సంపు నకు కార్పొరేషన్ నీటిని సరఫరా చేస్తుందని సంపు నుండి వాటర్ ట్యాంక్ నకు వాటర్ ను పంపించాల్సిన అవసరం ఉందని అట్టి పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు.ఇదే ప్రాంతం లో డ్రైనేజీ వ్యవస్థను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఏం హెచ్ ఓ డా.రాజేష్ ఈ ఈ రవి కుమార్ డి ఈ లు రాజ్ కుమార్ రాగి శ్రీకాంత్ సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# భూపాలపల్లి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా నవీన్ రెడ్డి

**భూపాలపల్లి, మహా :** డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన గండ్ర నవీన్ రెడ్డి సోమవారం ఉదయం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కు జాయినింగ్ రిపోర్ట్ సమర్పించారు. విధుల్లో చేరిన నవీన్ రెడ్డిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అభినందిస్తూ, ప్రజలకు సేవలందించే క్రమంలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం తండ్రి, తండ్రి బంధు మిత్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర కేడర్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా నియామకం పొందడం అభినందనీయమని అన్నారు. విధుల నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని బాధ్యతలను సమర్థవంతంగా నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కోచింగ్ తీసుకున్న వివరాలను అడిగి తెసులుకున్నారు. ఉద్యోగ సాధనలో ప్రోత్సాహించిన తల్లితండ్రులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



## హమాలీ కార్మికులకు దసరా కానుక బియ్యం పంపిణీ

**కాటారం, మహా :** కాటారం మండలం గారేపల్లి హమాలి సంఘం కార్మికులకు దసరా కానుకగా సోమవారం బియ్యం పంపిణీ చేశారు. కాటారం డివిజన్ హనుమాన్ దీక్ష సేవాసమితి కి చెందిన జంగ సమ్మయ్య గారు పల్లి అమలు సంఘం వద్ద జరిగిన కార్యక్రమంలో ఒక్కో హమాలీ కార్మికుడికి పది కిలోల చొప్పున దసరా పండుగ నేపథ్యంలో బియ్యం పంపిణీ చేశారు. కాటారం డివిజన్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ జంగ సమ్మయ్య ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటున్నారని పలువురు అభినందించాలి ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా పిరమిడ్ స్పిచ్చువాల్ మూమెంట్ సేవాదళ్ అధ్యక్షులు అనంతుల రమేష్ బాబు బిజెపి నాయకులు దుర్గం తిరుపతి, బొంతల రవీందర్, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ కొట్టే శంకరయ్య, హమాలి సంఘం అధ్యక్షుడు లింగయ్య, మంత్రి రాజయ్య హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్ నగరంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## భక్తి శ్రద్ధలతో గౌరమ్మ పూజలు ఆడి, పాడిన ఆడపడుచులు

**వరంగల్, హనుమకొండ మహా;** తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ పండుగ అంటేనే ఓ సంబురం.. చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరికీ ఎంతో ఉత్సాహాన్ని నింపుతుంది ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సగటు తెలంగాణ ఆడపడుచులకు ఇంతకంటే పెద్ద పండగ ఏదీ లేదు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను దేవతగా కొలిచే అరుదైన పండుగ. తీరొక్క పూలను తెచ్చి.. తంగిడి పువ్వు, గునుగు పువ్వు లతో అందంగా పేర్చి.. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆటపాటలతో ఉల్లాసంగా ప్రకృతిని, పూలను పూజించే గొప్ప పండుగ ఇది. బతుకమ్మ పండుగలో చివరి రోజు సద్దుల బతుకమ్మగా కీర్తిస్తూ మహిళలు సంతోషంగా ఆడి, పాడే పండుగ ఇది. అయితే సద్దుల బతుకమ్మ పండుగ తేదీ పై కొంత గందరగోళం నెలకొన్నప్పటికీ స్థానిక పూజారులు, ప్రజా ప్రతినిధుల సూచనలతో సోమవారం రోజునే జరపాలని నిర్ణయించారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా వరంగల్ దేశాయిపేట లోని చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద పెద్ద ఎత్తున మహిళలు చేరుకొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. మెట్ల బావి శ్రీ ధన మైసమ్మ దేవి ఆలయం వద్ద అధ్యక్షులు తోట బాబన్న ఆధ్వర్యంలో మహిళలు పాల్గొని బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. తోట సంధ్య అలంకరించిన పెద్ద బతుకమ్మ అందరినీ ఆకట్టు



కుంది. 27వ డివిజన్ లోని శ్రీ గోవిందరాజుల గుట్ట ఆవరణలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ సీనియర్ నాయకులు చింతాకుల సునీల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వరంగల్ హనుమకొండ జిల్లాల్లోని అన్ని గ్రామాల్లో పొద్దు పోయాక తీరొక పూలతో మహిళలు ఒకచోట గుమ్మికూడి బతుకమ్మ పాటలతో సందడి చేసి నీటివనరుల్లో బతుకమ్మను నిమజ్జనం చేశారు. తల్లి సల్లంగా చూడు అంటూ ఏడాదికి మళ్లీ రమ్మని గౌరమ్మను సాగనంపారు. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతం 19, 20, 27, 34, 35 డివిజన్ లలో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఊరు, వాడ ఒక్కటై బతుకమ్మ పాటలు పాడుతూ గౌరమ్మ చల్లంగ చూడంటూ వేడుకున్నారు. కాగా వరంగల్ హనుమకొండ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మను మంగళవారం నిర్వహించుకుంటామని స్థానిక ప్రజలు తెలుపడం గమనార్హం.

**పటిష్ట పోలీసు బందోబస్తు**

సద్దుల బతుకమ్మ సందర్భంగా వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పి శుభమ్ ప్రకాష్ నేతృత్వంలో దేశాయిపేట వడ్డెపల్లి చెరువు, శ్రీ భద్రకాళి ఆలయం, శ్రీ గోవిందరాజుల గుట్ట, శివనగర్, ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు బతుకమ్మ ఆడే ప్రాంతాల్లోకి పురుషులు లోపలి రాకుండా తగు చర్యలు తీసుకున్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై
# ఎస్ఈసి వీడియో కాన్ఫరెన్స్

### భూపాలపల్లి జిల్లాలో పోడు అమల్లోకి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మహా :** రాష్ట్రంలో రెండు దఫాలుగా ఎంపిటిసి, జడ్పిటిసి, 3 దఫాలుగా సర్పంచ్ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమలుపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అనుసరిస్తూ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్ లను తొలగించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ఎన్నికల నిర్వహించడానికి అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు నిర్వహణపై పిఓలు, ఏపిఓ లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టి,వివిఎస్టీ, ఎంసిసి టీములను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంపిటిసి, జడ్పిటిసి, వార్డు సభ్యులు, సర్పంచి ఎన్నికలు నిర్వహణకు సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలన్నారు. బ్యాలెట్ బాక్స్ లను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలో మరమ్మత్తు చేయించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ఉండాలని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం, డబ్బు లేదా బహుమతుల తదితర కార్యక్రమాలు ద్వారా ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లను వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన సిబ్బంది, భద్రతా బలగాల సమన్వయం మరియు ఐటీ ఆధారిత పర్యవేక్షణ చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జిల్లాలలో బోర్డర్ చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి తనికీలు చేపట్టాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టే అంశాలపై నిఘా పెంచాలని పర్యవేక్షణకు, ఫ్లైయింగ్ స్కాడ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి ఎంపిడిఓలకు, తహసీల్దార్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. నామినేషన్లు, కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ను ప్రకటించిన నేపథ్యంలో తక్షణమే భూపాలపల్లి జిల్లాలో (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయడానికి నోడల్ అధికారులు పటిష్ట పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గోడలపై రాజకీయ వ్రాతలు, ఫ్లెక్సీలు వంటివి తొలగించాలని నియమావళి ఉల్లంఘన జరిగితే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## దుర్గాదేవి మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా;** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పశ్చిమ నియోజకవర్గం లోని పలు దేవాలయాలను దుర్గామాత మండపాలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సందర్శించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం హన్మకొండలో గల శ్రీ శ్రీ శ్రీ సిద్దేశ్వర దేవాలయాన్ని నాయిని రాజేందర్ రెడ్డి తన అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డితో కలిసి సందర్శించి ఆలయ పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 54వ డివిజన్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి పూజాలు నిర్వహించారు. తదనంతరం 4వ డివిజన్లో ఫ్రెడ్స్ యూత్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యంత భారీ దుర్గామాత విగ్రహన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 52 అడుగుల భారీ విగ్రహన్ని ప్రతిష్టించిన కమిటీ సభ్యులను అభినందించారు. కాజీపేటకు చెందిన కడిపికొండ, విష్ణుపురి వాటర్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ వద్ద గల మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు. అలాగే వరంగల్ మాట్టెవాడ, ఎంజీఎం కూడలిలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాలను సందర్శించి దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలలో కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్, సయ్యద్ విజయ రజాలి, గుంటి శ్రీనివాస్, రవీందర్, కాంగ్రెస్ బ్లాక్ ప్రెసిడెంట్లు స్థానిక డివిజన్ ప్రెసిడెంట్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, మహా : మంచిరాల జిల్లా వివిధ ప్రభుత్వ శాఖలలో సమస్యల పరిష్కారం కొరకు ప్రతి సోమవారం ప్రజావాణి అర్జీదారులు సమర్పించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల మునిసిపాలిటీ 17వ వార్డు పాదం శ్రీలత, పూదరి శ్రీనివాస్ భార్యాభర్తల తాము ఇద్దరము దివ్యాంగులమని, గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ప్లాస్టరింగ్ దశలో ఉందని, మున్సిపల్ జాబితాలో ఎల్ 1 లో ఉన్నామని, తమ పరిస్థితిని పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు వర్తింప చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం మల్కేపల్లి గ్రామానికి చెందిన కసాడి శ్రీనివాస్ 1993 వరకు తమ గ్రామం ఎస్.సి. రిజర్వుడ్ సర్పంచ్ గా పరిగణించబడిందని, 2001 లో కొందరి నిర్లక్ష్యం కారణంగా ఎస్.టి. రిజర్వుడ్ గా మార్చబడిందని, ప్రస్తుత ఎన్నికల నిర్వహణలో రిజర్వేషన్ మార్చగలరని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన హరికిషన్ పాండే పట్టణంలోని యువ సంఘటన పాఠశాల సమీపంలో గల వాటర్ ట్యాంక్ శిథిలావస్థలో ఉందని, ఎలాంటి ప్రమాదం జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని



కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండల కేంద్రానికి చెందిన కె.శ్రీనివాస్ తాను కొనుగోలు చేసిన భూమిలోనికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్న వ్యక్తి అక్రమంగా చొరబడి నిర్మాణం చేపడుతున్నాడని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన పిన్న సాయితేజ తాను సాదాబైనమా ద్వారా కొనుగోలు చేసిన భూమిని క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకోగా తిరస్కరించడం జరిగిందని, ఈ విషయమై దరఖాస్తును పునరుద్ధరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గంగుల వారి పెద్ద బతుకమ్మ

**ఆలేరు, మహా:** తెలంగాణలో సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీక బతుకమ్మ పండుగ.. తెలంగాణలో మహిళలు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభం చేసి 9 రోజులు సద్దుల బతుకమ్మ వరకు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ అడివికి ,పొలానికి వెళ్లి తంగేడు, గూనుగు,గుమ్మడి,గడ్డి,బీర, బంతి, చామంతి పూలు తెచ్చి అందంగా పేర్చి సాయంత్రం గ్రామ కుడలిలో పెట్టి అందరు వాటి చూటూ బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా ఆడుతారు అనంతరం గ్రామ చెరువు ,కుంటల్లో బతుకమ్మను నిమజ్జనం చేస్తారు.. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తంగేడు,గూనుగు ,గడ్డి,గుమ్మడి తదితరపూలు దొరకడంలేదు అయిన తగ్గేదే లేదు అని బతుకమ్మ పండుగకు సుమారు 6 ఫీట్ల పైన బతుకమ్మను పేర్చి సంబరాలు జరుపుకుంటున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన గంగుల కుటుంబం... మూడు తరాలుగా ఆ గ్రామంలో పెద్ద బతుకమ్మ ,అందమైన బతుకమ్మతో ప్రజల మన్ననలు అందుకుంటున్నారు అతి పెద్ద బతుకమ్మ పేర్చే క్రమంలో ఆ కుటుంబ ఏడు రోజులు పడ్డ కష్టాలు, సంతోషం మహా తెలుగు పత్రికతో పంచుకున్నారు....

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇందిరమ్మ ఇండ్లు-శ్రీహరి రావు

**నిర్మల్, మహా :** నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండలం న్యూ లోలం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచారి శ్రీహరిరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను విడతలవారీగా లబ్ధిదారులకు అందిస్తుందని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిరమ్మ నూతన గృహాలను నిర్మించిందని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన గృహాలను నిర్మించలేదని మళ్లీ ఇందిరమ్మ రాజ్యంలోనే నూతన గృహాలను నిర్మించి పేదవారికి బహుమతిగా ఇస్తుందని అన్నారు. ఎవరైనా నిరుపేదలు డబ్బు లేకుండా ఉన్నట్లయితే సమాఖ్య సంఘాల నుండి లక్ష రూపాయల రుణం తీసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ



మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి,మాజీ ఎంపీపీ పాల్దే అనిల్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అంగూరి మహేందర్, శ్రీ కదిలి పాపహరేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నర్వాడే వెంకట రావు, కాల్వ దేవస్థానం ఆలయ ధర్మకర్త నర్సయ్య, సప్పల రవి, అరుగుల రమణ, గోవిందుల మహేష్ తదితరులున్నారు.

## సాహితీ కిరీటి అవార్డు గ్రహీతలకు సత్కారం

**ఆదిలాబాద్ మహా :** ఇటీవల శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కవులు చేస్తున్న సాహితీ సేవలను గుర్తించి హైదరాబాదులో సాహితీ కిరీటి అవార్డు పొందిన కవులను స్థానిక సాహితీ వేత్తలు ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా సోమవారం నిర్మల్ పట్టణంలోని తెరవే కార్యాలయంలో తెలంగాణ సాహితీ సాంస్కృతిక భాష,యాసల ను ప్రతిబింబించే విధంగా ఎన్నో రచనలు చేస్తున్న పురస్కార గ్రహీతలు డాక్టర్ తుమ్మల దేవరావు,పత్తి శివప్రసాద్,పోలీస్ భీమేష్ లను తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా తరపున శాలువా మెమెంటోతో సత్కరించారు. నిర్మల్ కవులు జాతీయస్థాయిలో అవార్డులు తెచ్చుకునే స్థాయికి ఎదిగారని తెరవే ఉపాధ్యక్షులు డాక్టర్ కృష్ణమరాజు అన్నారు. ముందు ముందు ఇంకెన్నో గొప్ప పురస్కారాలు తీసుకురావాలని అభిలషించారు. ఆ దిశగా రచనలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెరవే నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, కవులు బొందిడి పురుషోత్తమ రావు, కుమ్మరి నాగారం, టి. డి. ఏ.జిల్లా అధ్యక్షులు తిప్రిస్ సంతోష్ కుమార్ పలువురు కవులు రచయితలు పాల్గొన్నారు.






## ప్రజావాణి 31 ఆర్జిలు

**యాదాద్రి భువనగిరి. మహా:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 31 అర్జీలను, జిల్లా కలెక్టర్,జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థలు కలెక్టర్ భాస్కరరావు తో కలసి అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 25, జిల్లాపంచాయతీ మున్సిపాలిటీ, సర్వే ల్యాండ్, హౌసింగ్, వైద్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి,హౌసింగ్ పి.డి విజయసింగ్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మోసం చేసిన వ్యక్తి ఇంటి ముందు నిరసనను చేపట్టిన బాధితులు

**బెల్లంపల్లి,మహా:** మోసం చేసిన వారి ఇంటి ముందు బాధితుల ఆందోళన నిర్వహించడం బెల్లంపల్లి మండలంలోని బట్వాన్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గత కొన్ని రోజుల క్రితం నకిలీ పత్రాలను చూపించి భూమిని అమ్మకానికి పెట్టడంతో మంథని మండలానికి చెందిన వడ్డెర కులస్తులు ఆదివారం రాత్రి బెల్లంపల్లి మండలంలోని బట్వాన్ పల్లి గ్రామంలో వారిని మోసం చేసిన వ్యక్తుల ఇండ్ల ఎదుటన నిరసను చేపట్టడం చర్చనీయాంశమైంది.తాండూర్ మండలంలో 12 ఎకరాల భూమిని నకిలీ పత్రాలు చూపించి బాధితుల వద్ద నుంచి 45 లక్షలు తీసుకొని తప్పించుకు తిరుగుతున్నారని ఆరోపించారు. డబ్బులు చెల్లించి రెండు నెలలు గడుస్తున్నా భూమిని అమ్మకానికి పెట్టిన వ్యక్తులు రిజిస్ట్రేషన్ కు రాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా సంబంధిత భూమికోసం ఇచ్చిన నగదును తమకు చెల్లించాలని లేనిపక్షంలో భూమినైన ఇప్పించి తమకు న్యాయం చేయాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## సరస్వతీమాతగా శ్రీ భద్రకాళి అమ్మవారు

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం అర్చకులు నిత్యాహ్నికం నిర్వర్తించి అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. సోమవారం అమ్మవారు సాధకుడి బుద్ధిలోకి ప్రవేశిస్తుంది. సరస్వతీ మాతగా అలంకరింపబడిన అమ్మవారి దర్శనంతో సాధకుడికి సకల విద్యలు సమకూరుతాయని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. అమ్మవారికి ఉదయం భద్రపీఠ సేవ, సాయంకాలం అశ్వవాహన సేవ నిర్వహించారు. మంగళవారం భద్రకాళి అమ్మవారి జన్మోత్సవం. దుర్గ భద్రకాళిగా కోటి యోగిని గణములతో ప్రాదుర్భావం చెందిన రోజు కాబట్టి బతుకమ్మ కూడా దుర్గాష్టమినాడే జన్మించిందని ఆనాడే చద్దులు చేయడమనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. అనంతరం సాయంకాలం ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి, సహాయ కమిషనర్ రామల సునీత తెలిపారు.

## గుర్తింపు సంఘంతో సింగరేణి స్ట్రక్చర్ సమావేశం

### మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ

**మందమర్రి, మహా :** సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) తో సోమవారం మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణ అధ్యక్షతన అధికారుల బృందం స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ గుర్తింపు సంఘం యూనియన్ ప్రతినిధులతో 10 వ స్ట్రక్చర్ నిర్వహించినట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి ఉత్పాదకత లో కార్మిక సంఘాల పాత్ర చాలా కీలకమైనదని వివరించారు. అంతేకాకుండా ఉద్యోగుల సంక్షేమానికి కూడా ఎక్కువ ప్రదాన్యతను ఇస్తుందని పేర్కొన్నారు. గడిచిన సమావేశంలో జరిగిన పనుల యొక్క పురోగతి గురించి చర్చించామన్నారు. ఆ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నాయకులు కోరారు. మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు వెం



కటస్వామి, అక్బర్ అలీ, దాగం మల్లేష్, ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, కే.కే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, కేకే ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, ఐఈడి (ఎస్ఇ) కిరణ్ కుమార్,ఏరియా స్టోర్స్ డీ.జీ ఎం ఈ అండ్ ఎం సురేష్,సివిల్ ఎస్.ఇ రాము,డి.వై.పి.ఎం సందీప్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, సుదర్శన్,సి.వి రమణ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పకడ్బందీగా జరగాలి-కలెక్టర్

**ఆదిలాబాద్ మహా:** స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడడంతో జిల్లా అధికారులు ఎన్నికల నిర్వహణపై కసరత్తు ప్రారంభించారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఇతర ముఖ్య జిల్లా అధికారులతో కలిసి జడ్పీ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రకటన దగ్గరనుండి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, నిర్వహణపై దిశానిర్దేశం చేసారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు.ఎన్నికల నియమావళిని అధికారులు తూచా తప్పకుండా పాటించాలని అన్నారు.ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ పర్యవేక్షణలో కొనసాగించాలన్నారు. అధికారులు ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.ఎన్నికల విధుల్లో రిటర్నింగ్ ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకమని,బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్,అసిస్టెంట్ శిక్షణ కలెక్టర్ సలోని చబ్ర,జడ్పీ ఇన్చార్జి సీఈఓ రవీందర్ రాథోడ్,డీపీఓ,ఆర్ఓలు పాల్గొన్నారు.

## 91 మంది హమాలీలకు దసరా బోనస్ ...



**యాదాద్రి భువనగిరి, మహా :** దసరా పండుగను పురస్కరించుకొని సోమవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ జి.వీరారెడ్డి జిల్లాలో ఉన్న పౌర సరఫరాల సంస్థ గోదాంలో పనిచేస్తున్న 91 మంది హమాలీలకు మరియు 5 మంది స్వీపర్సలకు దసరా బోనస్ ఒకరికి ₹7500/ చొప్పున మరియు ₹900/ ల విలువ గల స్వీట్ బాక్సులు అందించారు. అదేవిధంగా ప్రతి ఒక్క హమాలీకి 2 జతల బట్టలు మరియు స్వీపర్స్ లకు 2 జతల చీరలు దసరా పండగ సందర్భంగా అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ డి. హరికృష్ణ, ఆఫీసు సిబ్బంది కె.గణేష్ మరియు హమాలీలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీ మహిళా మృతి

**ఆలేరు, మహా :** స్కూటీపై వెళ్తున్న మహిళను బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో జరిగింది. సోమవారం నాడు నేషనల్ హైవే పై ఈ రోడ్డు ప్రమాదం జరిగింది ఆలేరు పోలీసు స్టేషన్ ఇన్ చార్జ్ యాలాద్రి తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లా పల్లగుట్ట గ్రామానికి చెందిన సాదం కోమల (42) హైదరాబాదులో అమర్ పేట హాస్పటల్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. యాక్టివా బండిమీద హైదరాబాదు నుండి సొంత గ్రామానికి వస్తున్న క్రమంలో ఆలేరు పట్టణంలోని కంది గడ్డ తండా చత్రపతి దాబా సమీపంలో వెనుక నుండి గ్లామర్ బైక్ సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేపర్తి గ్రామానికి చెందిన అందే అజయ్ స్కూటీ వెనుక నుండి గుద్దడంతో కోమల తీవ్రంగా గాయపడ్డారు ఆమెను దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని సిఐ తెలిపారు.

# ఐదేళ్లలో 3 లక్షల సేల్స్: మళ్ళీ తగ్గిన ధర



దేశీయ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా.. ఇండియన్ మార్కెట్లో తన థార్ ఎస్యూవీ లాంచ్ చేసినప్పటి నుంచి 3 లక్షలకు పైగా అమ్మకాలను నమోదు చేసింది. దీంతో ఈ ఆఫ్ రోడర్ సరికొత్త అమ్మకాల మైలురాయిని చేరుకుంది. భారతదేశంలో మహీంద్రా థార్ అక్టోబర్ 2020లో ప్రారంభమైంది. అప్పటి నుంచి కేవలం ఐదు సంవత్సరాలలో మూడు లక్షల అమ్మకాల మైలు రాయిని చేరుకుంది. ఇందులో థార్ రాక్స్ సేల్స్ కూడా ఉన్నాయి. దీనిని (థార్ రాక్స్) కంపెనీ సెప్టెంబర్ 2024లో లాంచ్ చేసింది. 2026 ఆర్థిక సంవత్సరం మొదటి 5 నెలల్లో జరిగిన మొత్తం థార్ అమ్మకాలలో.. థార్ రాక్స్ 68 శాతం వాటా కలిగి ఉంది. దీన్నిబట్టి చూస్తే.. దేశీయ విఫణిలో థార్ రాక్స్ అమ్మకాలు గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. ఈ కారు ధర కొత్త జీఎస్టీ అమలులోకి వచ్చిన తరువాత రూ. 1.35 లక్షలు తగ్గింది. ఇది అమ్మకాలను మరింత పెంచే అవకాశం ఉంది. మహీంద్రా థార్ ధరలు రూ. 10.32 లక్షల నుంచి ప్రారంభమై.. రూ. 16.61 లక్షల (ఎక్స్‌షోరూమ్) వరకు ఉంటాయి. అదే సమయంలో, మహీంద్రా థార్ రాక్స్ ధరలు రూ. 12.25 లక్షల (ఎక్స్‌షోరూమ్) నుండి ప్రారంభమవుతాయి. ఈ కార్లు భద్రతలో కూడా మంచి స్కోరింగ్ పొందడంతో.. ఎక్కువ మంది వీటిని కొనుగోలు చేయడానికి ఎగబడుతున్నారు.

## మాంద్యం ఎఫెక్ట్: భారీ లేఆఫ్స్ ప్రకటించిన లుఫ్తాన్స



ప్రపంచ వ్యాప్తంగా లేఆఫ్స్ కొనసాగుతూనే ఉన్నాయి. దిగ్గజ సంస్థలు సైతం ఉద్యోగులను తగ్గించుకోవడానికి చూస్తున్నాయి. ఈ తరుణంలో జర్మన్ ఎయిర్‌లైన్ గ్రూప్ లుఫ్తాన్స కీలక ప్రకటన చేసింది. 2030 నాటికి 4000 ఉద్యోగులను తొలగించనున్నట్లు వెల్లడించింది. లుఫ్తాన్స తొలగించనున్న ఉద్యోగులలో ఎక్కువ భాగం.. జర్మనీలే ఉన్నారు. కంపెనీ ఖర్చులను తగ్గించి కొత్త సాంకేతికతలకు అనుగుణంగా మారాలనే ఉద్దేశ్యంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగాల కోతలు ప్రధానంగా పైలట్లు, క్యాబిన్ సిబ్బంది లేదా గ్రౌండ్ స్టాఫ్ మొదలైనవారు ఉన్నారు. జర్మనీ రెండో సంవత్సరం ఆర్థిక మాంద్యం ఎదుర్కొంటున్న సమయంలో ఈ ప్రకటన వెలువడింది. లుఫ్తాన్స కంపెనీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1,03,000 మంది ఉద్యోగులను కలిగి ఉంది. దీని నెట్‌వర్క్‌లో యూరో వింగ్స్, ఆస్ట్రియన్ ఎయిర్‌లైన్స్, స్విస్, బ్రస్సెల్స్ ఎయిర్‌లైన్స్ మాత్రమే కాకుండా.. ఇటలీకి చెందిన కొత్త ఫ్లాగ్‌షిప్ క్యారియర్‌గా ఇటీవల కొనుగోలు చేసిన ఐటీఏ ఎయిర్‌వేస్ కూడా ఉన్నాయి. ఉద్యోగులను తొలగించనున్న కంపెనీల జాబితాలో జర్మన్ దిగ్గజం లుఫ్తాన్స మాత్రమే కాకుండా.. పారిశ్రామిక ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కంపెనీ బాష్ కూడా ఉంది. ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 13,000 ఉద్యోగాలను తగ్గించనున్నట్లు తెలిపింది. ఇది దాని ఉద్యోగులలో మూడు శాతానికి సమానం.



### చాట్‌జీపీటీతో కొత్త భాష..

## కేవలం 30 రోజుల్లో!

ఏ ప్రశ్నకైనా సమాధానం ఇచ్చే చాట్‌జీపీటీ.. ఇప్పుడు కొత్త భాషలు నేర్చుకోవడానికి కూడా సహకరిస్తోంది. నెల రోజుల వ్యవధిలోనే.. పదజాలం, వ్యాకరణం, మాట్లాడటం వంటివి సులభంగా నేర్చుకోవచ్చు!. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సులభంగా కొత్త భాషను 30 రోజుల్లో నేర్చుకోవడానికి 8 ప్రాంప్ట్‌లను ఉపయోగించాల్సి ఉంటుందని మార్కెటింగ్, గ్రోత్ నిపుణుడైన 'చిదానంద్ త్రిపాఠి' పేర్కొన్నారు. అవి ''30 రోజులలో భాషా అభ్యాస ప్రణాళిక, రోజువారీ పదజాలం, అభ్యాస అనుకరణ, సాధారణ పదాలలో వ్యాకరణ వివరణ, వినడం, నిజ జీవిత సంభాషణకు సంబంధించిన ఉదాహరణలను క్రియేట్ చేయడం, తప్పుల దిద్దుబాటు, మోటివేషనల్ చెక్''. పైన చెప్పిన 8 ప్రాంప్ట్‌లను ఉపయోగించడం ద్వారా.. నెల రోజుల్లో కొత్త భాషను సులభంగా నేర్చుకోవచ్చని.. చిదానంద్ త్రిపాఠి పేర్కొన్నారు. ప్రాక్టీస్ చేయడానికి, పదాలను తెలుసుకోవడానికి చాట్‌జీపీటీ ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

# కొత్త రూల్..

## ఎలక్ట్రిక్ వాహనాలకు సౌండ్ తప్పనిసరి!



రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని.. 2027 అక్టోబర్ 1 నుంచి అన్ని ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, ట్రక్కులకు అకౌస్టిక్ వెహికల్ అలర్ట్ సిస్టమ్ను తప్పనిసరి చేయాలని రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. అక్టోబర్ 2026 తర్వాత.. తయారయ్యే అన్ని కొత్త ఎలక్ట్రిక్ వాహనాలు తప్పనిసరిగా ఈవీఏఎస్ కలిగి ఉండాలని మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ సిస్టం వల్ల ఎలక్ట్రిక్ కారు కూడా సౌండ్ చేస్తుంది. ఈ సౌండ్ వల్ల కారును ఎవరైనా సులభంగా గుర్తించవచ్చు. అమెరికా, జపాన్, కొన్ని యూరోపియన్ యూనియన్ దేశాలు ఇప్పటికే హైబ్రిడ్ వాహనాలలో AVAS వాడకాన్ని తప్పనిసరి చేశాయి. ఇది రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో సహాయపడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ ఇండియాలో కూడా ఈ విధానం అమలు చేయాలని సంకల్పించింది. నిజానికి ఎలక్ట్రిక్ కార్లు.. ఫ్యూయెల్ కార్ల మాదిరిగా సౌండ్ చేయవు. దీనివల్ల ముందు వెళ్తున్న కారుకు లేదా వ్యక్తులకు వెనుక ఒక కారు వస్తుందనే విషయం తెలియకుండా పోతుంది. ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకునే ఎలక్ట్రిక్ కార్లలో అకౌస్టిక్ వెహికల్ అలర్ట్ సిస్టమ్ ఉండాలని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# బై నౌ పే లేటర్ బంద్.. ఆర్బీఐ ఆదేశాలు



బెంగళూరుకు చెందిన బైనౌపేలేటర్ (BNPL) సంస్థ సింపుల్ (Simpl) తక్షణమే తన చెల్లింపు కార్యకలాపాలను నిలిపివేయాలని ఆర్బీఐ (RBI)ఆదేశించింది. ఆర్బీఐ అనుమతి లేకుండా ఈ సంస్థ సుమారు 26,000 మంది వ్యాపారులతో ఒప్పందాలు చేసుకుని 'బైనౌపేలేటర్' పేరుతో రుణ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్ 2007 ప్రకారం, స్పష్టమైన అనుమతి లేకుండా ఏ కంపెనీ కూడా అటువంటి వ్యవస్థను ఆపరేట్ చేయడానికి వీల్లేదని ఆర్బీఐ చెబుతోంది. డిజిటల్ క్రెడిట్ వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో 'బైనౌపేలేటర్' స్కీములు ఇటీవల బాగా విస్తరించాయి. తక్షణ క్రెడిట్ లైన్లతో వినియోగదారులను, వ్యాపారులను ఈ సంస్థలు ఆకర్షిస్తున్నాయి. అసురక్షిత రుణాలు, బలహీనమైన పర్యవేక్షణ, పేలవమైన వినియోగదారుల రక్షణ వంటి ఆందోళనలతో ఆర్బీఐ 2022లోనే బీఎన్‌పీఎల్ సంస్థలను అప్పు తీసుకున్న డబ్బుతో ప్రీపెయిడ్ చెల్లింపు సాధనాలను టాప్ అప్ చేయకుండా నిలిపివేసింది. వన్ సిగ్మా టెక్నాలజీస్ నిర్వహిస్తున్న సింపుల్ గతంలో భారత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), విదేశీ మారక నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టికి వచ్చింది. 100 శాతం ఆటోమేటిక్ ఎఫ్‌డీఐ ఆమోదానికి అర్హత కలిగిన ఐటీ సర్వీసెస్ గా తన వ్యాపారాన్ని వర్గీకరించడం ద్వారా కంపెనీకి రూ .913 కోట్లు తెచ్చుకుందన్న ఆరోపణలు ఉన్నాయి.

# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL

## చైనా కోసం గాడిదలు పెంచుతున్న పాకిస్థాన్..



తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్ సరికొత్త వ్యాపార అవకాశాలపై దృష్టి పెట్టింది. చైనా కోసం గాడిదలను పెంచుతోంది. ఇందుకోసం చైనా కంపెనీ జింగ్యింగ్ పెట్టుబడులతో పెషావర్‌లో 37 మిలియన్ డాలర్లతో భారీ ప్రాజెక్టును రూపొందించింది. ఇందులో భాగంగా ఏటా 80 వేల గాడిదలను చైనాకు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. చైనాలో గాడిద మాంసానికి, ఎముకలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో నెలకు 10 వేల గాడిదలను ప్రాసెస్ చేసి, మాంసం ఎగుమతులు చేయాలని నిర్ణయించినట్లు పాకిస్థాన్ ఆహార భద్రత మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అయితే స్థానికంగా మాత్రం గాడిద మాంసం అమ్మకాలపై నిషేధం ఉంటుందట. చైనాకు గాడిద మాంసాన్ని ఎగుమతి చేసేందుకు పెషావర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గాడిదల పెంపకానికి ఆధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. అలాగే పాకిస్తాన్‌లోని వివిధ ప్రాంతాలలో 40 ప్రత్యేక పొలాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

# మాది విశేషమైన బంధం



**ఐక్యరాజ్యసమితి:** భారతదేశ ప్రయోజనాలను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరించే స్వతంత్ర విదేశాంగ విధానాలను తాము సంపూర్తిగా గౌరవిస్తామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ పేర్కొన్నారు. అమెరికాతో గానీ మరే ఇతర దేశంతోగానీ భారత్ సంబంధాలు, భారత్, రష్యాల మధ్య సంబంధాలకు ప్రామాణికం కావని స్పష్టం చేశారు. భారత్, రష్యాలు విశేషమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఆయన ఈ మేరకు విస్పష్టంగా ప్రకటించారు. అమెరికా లేదా మరే ఇతర దేశంతో భారత్ సంబంధాల్లో ఏర్పడే ఉద్రిక్తతల ప్రభావం భారత్-రష్యాల మధ్య పడబోదని లావ్‌రోవ్ తెలిపారు. అంతకుముందు, ఆయన మీడియాతో మాట్లాడారు. రష్యా ఆయిల్ కొనరాదంటూ భారత్‌పై అమెరికా చేస్తున్న ఒత్తిడుల నేపథ్యంలో ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు. 'అమెరికాతో సంబంధాలను గురించి భారతీయ మిత్రులను అడగను. ఇలాంటి విషయాలపై స్వయంగా తీసుకోగల సామర్థ్యం వారికి ఉంది'అని ఆయన అన్నారు. 'అమెరికా ఒక వేళ మాకు చమురు విక్రయించాలనుకుంటే ఆ విషయంలో ఆ దేశంతో సంప్రదింపులకు మేం సిద్ధం. అంతేతప్ప, ఇతర దేశాల నుంచి మేం ఏం కొనాలి, రష్యాతో ఏం కొనాలి, ఏం కొనకూడదు అనేవి మా సొంత విషయం. దీనికి భారత్-అమెరికా అజెండాతో సంబంధం లేదు'అని అమెరికాకు బదులిచ్చినట్లు జై శంకర్ నాతో అన్నారు. ఆయనది చాలా సరైన సమాధానం, ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే అంశం'అని లావ్‌రోవ్ వివరించారు. రెండు దేశాల మధ్య ఉన్నతస్థాయి సంబంధాలు సాధారణంగానే కొనసాగుతున్నాయన్నారు. ఈ విషయంలో ఎటువంటి ఇబ్బందీ కలగలేదని తెలిపారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశాల సమయంలో తమ అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీ సమావేశమైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధ్యక్షుడు పుతిన్ డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించే అవకాశాలున్నాయని లావ్‌రోవ్ వెల్లడించారు. వాణిజ్యం, సైనిక, సాంకేతిక సహకారం, ఆర్థిక, మానవీయ అంశాలు, ఆరోగ్యం, హైటెక్, కృత్రిమ మేధ వంటి అంశాల్లో ద్వైపాక్షిక సంబంధాలతోపాటు, ఎస్‌సీవో, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారం కొనసాగుతోందన్నారు. ఐరాస సమావేశాలకు హాజరైన భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌తోనూ లావ్‌రోవ్ భేటీ అయ్యారు. బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులతో భేటీ అయ్యారు.

# ట్రంప్ సంచలన నిర్ణయం..

## అమెరికాలో తెలుగు సినిమాలకు బిగ్ షాక్!



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇండియన్ సినిమాలకు భారీ షాక్ ఇచ్చారు. విదేశీ సినిమాలపై 100శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. అమెరికాలో నిర్మించే చిత్రాలకు మినహాయించారు. ట్రంప్ నిర్ణయంతో తెలుగు సినిమాలపై టారిఫ్ ఎఫెక్ట్ పడనుంది. దీంతో అమెరికాలో విడుదల చేసే టాలీవుడ్ సినిమాలు వందశాతం టారిఫ్ చెల్లించాల్సి ఉంది. విదేశీ సినిమాలపై 100శాతం విధిస్తూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికగా ట్వీట్ చేశారు. అందులో 'మా సినిమా నిర్మాణ వ్యాపారం అమెరికా సంయుక్త రాష్ట్రాల నుండి ఇతర దేశాలు దొంగిలించాయి. ఇది చిన్నపిల్లవాడి నుండి మిఠాయి దొంగిలించినట్లే. బలహీనమైన, అసమర్థ గవర్నర్‌తో కాలిఫోర్నియా తీవ్రంగా దెబ్బతింది. ఈ దీర్ఘకాలిక, ఎప్పటికీ అంతం కాని సమస్యను పరిష్కరించేందుకు, అమెరికా వెలుపల నిర్మించే అన్ని సినిమాలపై 100 శాతం సుంకం విధిస్తున్నాను'అని పేర్కొన్నారు.

### టాలీవుడ్ సినిమాలపై ఎఫెక్ట్

అమెరికాలో 700-800 థియేటర్లలో తెలుగు సినిమాలు విడుదలవుతుంటాయి. అలా విడుదలైన బాహుబలి, ఆర్ఆర్ఆర్, పుష్పతో పాటు ఇతర టాలీవుడ్ సినిమాలు అమెరికాలో కోట్ల రూపాయల వసూళ్లు సాధించాయి. టాలీవుడ్ పరిశ్రమ లెక్కల ప్రకారం.. అంతర్జాతీయంగా టాలీవుడ్ సినిమాలకు మార్కెట్ ఉన్న దేశాల్లో అమెరికా తొలి రెండుమూడు స్థానాల్లో ఉంది.

### టారిఫ్ ప్రభావం ఎలా ఉంటుందంటే

ఈ క్రమంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో టాలీవుడ్‌పై భారీ ఎఫెక్ట్ పడనుందని అంచనా. ట్రంప్ తాజా నిర్ణయంతో అమెరికాలో విడుదలయ్యే ప్రతి తెలుగు సినిమాపై వంద శాతం అదనపు టారిఫ్ చెల్లించాల్సి ఉంటుంది. అంటే.. ఒక సినిమా పంపిణీదారులు రూ.5 కోట్ల రూపాయల విలువైన హక్కులు కొనుగోలు చేస్తే..మరో రూ.5 కోట్లు టారిఫ్‌గా చెల్లించాల్సి ఉంటుంది. దీని వల్ల సినిమా టికెట్ ధరలు రెట్టింపు కావచ్చు. ప్రేక్షకులపై భారం పడే అవకాశం ఉంది.

### పరిశ్రమలో ఆందోళన

ఇండియన్ సినిమాలపై అమెరికా తీసుకున్న నిర్ణయం వల్ల విదేశీ పంపిణీ ఒప్పందాలు, విడుదల వ్యూహాలు మారిపోవచ్చు. అమెరికాలో వసూళ్లు తగ్గిపోతే, నిర్మాతలు, పెట్టుబడిదారులు తమ వ్యూహాలను పునరాలోచించాల్సి ఉంటుంది. ట్రంప్ ఈ నిర్ణయాన్ని 'అమెరికా సినిమా పరిశ్రమను రక్షించేందుకు' తీసుకున్నట్లు పేర్కొన్నారు. కానీ, ఇది అంతర్జాతీయ సినిమా వ్యాపారాన్ని గందరగోళంలోకి నెట్టే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## 12 మంది భారత జాలర్లను అరెస్ట్ చేసిన శ్రీలంక



**కొలంబో:** శ్రీలంక ఉత్తర ప్రాంతంలోని జాఫ్నా వద్ద ఆదివారం ఆ దేశ నేవీ 12 మంది భారతీయ జాలర్లను అరెస్ట్ చేయడంతోపాటు, వారి బోటును స్వాధీనం చేసుకుంది. ఆదివారం ఉదయం శ్రీలంక ప్రాదేశిక జలాల్లో డెల్ఫ్ట్ దీవి పక్కన అక్రమంగా చేపలు పడుతుండగా పట్టుకున్నామని నేవీ ఒక ప్రకటనలో తెలిపింది. కంకసేతురై హార్బర్‌కు మత్స్యకారులతోపాటు బోటును తరలించామంది. భారత్-శ్రీలంక ద్వైపాక్షిక సంబంధాలలో మత్స్యకారుల అంశం వివాదాస్పదంగా మారింది. శ్రీలంక నేవీ పాక్ జలసంధిలో భారత మత్స్యకారులపై కాల్పులు జరిపి, వారి పడవలను స్వాధీనం చేసుకోవడం పరిపాటిగా మారింది.

## గిరిజన బాలికపై సామూహిక అకృత్యం.. నిరసనల్లో ముగ్గురు మృతి



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ఒక బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం తీవ్ర నిరసనలకు దారి తీసింది. గిరిజన పాఠశాలకు చెందిన ఒక విద్యార్థినిపై జరిగిన అత్యాచారానికి వ్యతిరేకంగా జమ్ము స్టూడెంట్స్ బృందం నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఆదివాసీ గిరిజనులకు, ఇక్కడ స్థిరపడిన బెంగాలీవారికి మధ్య అల్లర్లు చోటుచేసుకున్నాయి. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించినప్పటికీ ఘర్షణలు కొనసాగి, ముగ్గురు మరణించారు. పలువురు గాయపడ్డారు. భారత్ మయన్మార్ సరిహద్దుల్లోని చిట్టగాంగ్ కొండ ప్రాంతాల్లోని ఖగ్రాచారీ జిల్లాలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన దరిమిలా ఘర్షణలు చోటుచేసుకున్నాయి .ఈ హింసాకాండలో 13 మంది సైనిక సిబ్బంది, ముగ్గురు పోలీసులు గాయపడ్డారని ఢాకాలోని హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఖగ్రాచారీ జిల్లా కేంద్రంలో తొలుత హింస చెలరేగింది. అక్కడి చక్మా, మర్మ అనే ఆదివాసీ తెగలకు చెందినవారు శనివారం టైర్లు కాల్చివేస్తూ, చెట్ల కొమ్మలు, ఇటుకలను అడ్డుగా పెట్టి రోడ్డు దిగ్బంధనం చేశారు. దీంతో పోలీసు అధికారులు అప్రమత్తమై పరిస్థితిని పర్యవేక్షించారు. పోలీసులతో పాటు సైనిక, పారామిలిటరీ బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ)దళాలు గస్తీ నిర్వహించాయి. అయినప్పటికీ హింస చెలరేగింది. బాధిత బాలిక ట్యూషన్ నుండి తిరిగి వస్తుండగా ఆమెపై సామూహిక అత్యాచారం జరిగింది. అర్ధరాత్రి సమయంలో ఒక నిర్మానుష్య ప్రదేశంలో అపస్మారక స్థితిలో పడివున్న బాలికను కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే ఆమెకు స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఒక బెంగాలీ యువకుడిని అరెస్టు చేశారు. అతను అత్యాచారం చేసిన వారిలో ఒకడని పోలీసులు అనుమానిస్తున్నారు. కోర్టు ఆదేశాలతో పోలీసులు ఆ యువకుడిని విచారిస్తున్నారు. కాగా గుయిమారాలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారని, వారి మృతదేహాలను ఖగ్రాచారీ ఆస్పత్రిలో ఉంచారని పోలీసు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అహ్సాన్ హబీబ్ విలేకరులకు తెలిపారు.

## ప్రేమ, జీవితం గురించి ఆలోజింపజేసే వ్యాఖ్యలు చేసిన సమంత..

టాలీవుడ్ స్టార్ నటి సమంత మళ్లీ తన వ్యక్తిగత జీవితం, ఆలోచనలు గురించి ఓపెన్‌గా మాట్లాడారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. సమంత చెప్పినదాని ప్రకారం, 20 ఏళ్ల వయసులో తాను గుర్తింపు కోసం పరుగులు పెట్టి, రెస్ట్ లేకుండా జీవితం గడిపేసిందని, ఆ ప్రక్రియలో తనను తాను కోల్పోయానని పేర్కొన్నారు. ప్రేమ అంటే ఏమిటో ఎవరూ చెప్పలేదు. కానీ 30 ఏళ్లకు వచ్చేసరికి మహిళలు చూసే ప్రతి విషయం భిన్నంగా ఉంటుంది. అందం, ఆలోచనల్లో మార్పు వస్తుంది" అని చెప్పారు. మనల్ని మనమే ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఇప్పుడు అర్థమైంది. నా ఆలోచన విధానాన్ని పూర్తిగా మార్చుకున్నాను. గతంలో చేసిన తప్పుల జ్ఞాపకాలను మోయడం మానేశాను. ప్రతి అమ్మాయి కూడా ఇలాగే ముందుకు సాగాలని కోరుకుంటున్నాను" అంటూ భావోద్వేగంగా మాట్లాడారు.ఇక అభిమానులకు పలు విషయాల గురించి సూచించిన సమంత.. జీవితాన్ని ఆస్వాదించండి, పరుగు తగ్గించండి. మీరు మీలా ఉన్నప్పుడే గర్వంగా, ధైర్యంగా, ఆనందంగా ఉండగలరు. అప్పుడే నిజమైన స్వేచ్ఛ అనుభూతి వస్తుంది" అని చెప్పారు.ఈ వ్యాఖ్యలతో సమంత చైతన్యతో విడాకుల తర్వాత ఎదుర్కొన్న ఒత్తిడి నుంచి బయటపడే ప్రయత్నం చేస్తోందని, ఇంకా పూర్తిగా తేరుకోలేదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అయితే ఆమె చెప్పిన మాటల్లో కొత్త ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. కెరీర్ మొదట్లో ఎన్నో ఇబ్బందులు పడ్డ సమంత ఆ తర్వాత మెల్లగా నిలదొక్కుకొని స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పెద్ద హీరోలతో సినిమాలు చేస్తూ ఓ రేంజ్‌కి వెళ్లిన తర్వాత అక్కినేని హీరో నాగ చైతన్యని వివాహం చేసుకుంది. నాలుగేళ్ల తర్వాత ఎందుకో వారిరివురు విడిపోయారు. ఇప్పటికీ వారి విడాకులకి సంబంధించి క్లారిటీ లేదు. ఇక మయోసైటిస్ బారిన పడి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్న సమంత క్రమంగా కోలుకొని కెరీర్‌పై ఫోకస్ పెట్టింది. ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హానీ, బన్నీ లాంటి సినిమాలతో సమంత క్రేజ్ బాలీవుడ్‌కి కూడా పాకింది. ప్రస్తుతం నిర్మాతగా కూడా సత్తా చాటుతుంది.





## తోటి హీరోయిన్‌కి షాకిచ్చిన రష్మిక..

పాన్ ఇండియా లెవల్లో ప్రస్తుతం బిజీ యాక్టర్ ఎవరైనా ఉన్నారా అంటే అది రష్మిక మాత్రమే. ఎందుకంటే ఓవైపు ప్రాంతీయ చిత్రాల్లో నటిస్తూనే మరోవైపు బాలీవుడు మూవీస్ కూడా చేస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే మూడు సినిమాలతో ప్రేక్షకుల్ని పలకరించింది. సరే ఇదంతా పక్కనబెడితే రష్మిక గురించి తోటి హీరోయిన్ ఓ ఫన్నీ వీడియో పోస్ట్ చేసింది. ఇదిప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఏడాది ఛావా, సికిందర్, కుబేర చిత్రాలతో వచ్చింది. వీటిలో రెండు హిందీ మూవీస్. వచ్చే నెలలో 'థామా' అనే బాలీవుడ్ హారర్ సినిమాతో రాబోతుంది. ఇది కాకుండా 'గర్ల్ ఫ్రెండ్' అనే తెలుగు చిత్రం కూడా రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. ఇవి కాకుండా 'కాక్ టెయిల్ 2' అనే హిందీ మూవీ కూడా చేస్తోంది. ఇందులో రష్మికతో పాటు కృతి సనన్ హీరోయిన్‌గా చేస్తోంది. తాజాగా వీళ్లిద్దరూ ఓ జిమ్‌లో కలిశారు. అయితే కృతి అక్కడకి వెళ్లడానికంటే ముందే రష్మిత వర్కౌట్స్ చేస్తూ కనిపించింది. 'రష్మిక నువ్వు ఎప్పుడు చూసినా జిమ్‌లోనే కనిపిస్తున్నావ్. కొంపదీసి ఇక్కడే బతికేస్తున్నావా?' అని కృతి సనన్ నవ్వుతూ అడగ్గా.. బదులిచ్చిన రష్మిక.. 'నువ్వు వచ్చేటప్పుడు నేను ఇక్కడ ఉంటున్నాను. ఎక్కువగా ఏం చేయడం లేదు' అని నవ్వేసింది. 'నువ్వు చాలా కష్టపడుతున్నావ్' అని కృతి సనన్ అనేసరికి వీళ్లిద్దరూ గట్టిగా నవ్వేసుకున్నారు. ఈ వీడియోని కృతి సనన్ తన ఇన్ స్టా స్టోరీలో పోస్ట్ చేసింది.



## ప్రభాస్ సరసన కొత్త భామ..

ప్రభాస్.. ఇప్పుడు 'రాజాసాబ్', ఫౌజీ చిత్రాలు పూర్తి చేసే పనిలో ఉన్నాడు. వీటితో పాటు లైన్‌లో చాలానే సినిమాలున్నాయి. సందీప్ రెడ్డి వంగా తీయాల్సిన 'స్పిరిట్' లిస్టులో ముందు వరసలో ఉంది. లెక్క ప్రకారం సెప్టెంబరులోనే షూటింగ్ మొదలవుతుందని చాన్నాళ్ల క్రితం సందీప్ ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు కానీ ఇప్పటికే స్టార్ట్ కాలేదు. ఇప్పుడు షూటింగ్‌తో పాటు మరో అప్‌డేట్ వినిపిస్తుంది. 'యానిమల్' తర్వాత సందీప్ వంగా చేస్తున్న సినిమా 'స్పిరిట్'. చాన్నాళ్ల క్రితమే ప్రకటన వచ్చింది గానీ ప్రభాస్ మూవీస్ లైనప్ వల్ల ఆలస్యమవుతోంది. ఫైనల్‌గా నవంబర్ 5వ తేదీ నుంచి షూటింగ్ మొదలుపెట్టాలని ఫిక్సయ్యారట. ఇందులో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ కనిపించబోతున్నాడు. అయితే ప్రభాస్ తండ్రిగా అతిథి పాత్రలో మెగాస్టార్ చిరంజీవి కనిపిస్తారనే టాక్ కాస్త గట్టిగానే వైరల్ అవుతోంది. సంజయ్ దత్ కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నాడట. ఇకపోతే హీరోయిన్‌గా తొలుత దీపిక పదుకొణెని అనుకున్నారు. కానీ పెట్టిన కండీషన్స్ నచ్చక సందీప్ ఆమెని ప్రాజెక్ట్ నుంచి తొలిగించాడనే కొన్నాళ్ల క్రితం వార్తల వచ్చాయి. దీపిక ప్లేసులో తృప్తి దిమ్రి వచ్చింది. ఇప్పుడు మలయాళ హీరోయిన్ మడోన్నా సెబాస్టియన్ కూడా 'స్పిరిట్'లో భాగమైందట. తొలుత ఈ పాత్ర కోసం బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్‌ని తీసుకున్నారట. ఇప్పుడు ఈమె స్థానంలోనే మడోన్నాని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈమెది సెకండ్ హీరోయిన్ క్యారెక్టరా? లేదంటే ప్రతినాయక పాత్ర అనేది తెలియాల్సి ఉంది. మడోన్నా సెబాస్టియన్ విషయానికొస్తే.. మలయాళంలో 'ప్రేమమ్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైంది. తర్వాత తమిళంలోనూ పలు చిత్రాలు చేసింది. తెలుగులో 'ప్రేమమ్' రీమేక్‌లో నాగచైతన్య సరసన నటించింది. తర్వాత 'శ్యామ్ సింగరాయ్' చేసింది. ఇన్నాళ్లకు ప్రభాస్ పక్కన ఛాన్స్ కొట్టేసిందని టాక్ వినిపిస్తుంది. ఒకవేళ ఇది నిజమైతే మాత్రం ఈమెకు అదృష్టం కలిసొచ్చినట్లే!



## తొలి వీకెండ్‌కే రూ.252 కోట్లు గ్రాస్!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన తాజా సినిమా 'ఓజీ' బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టిస్తోంది. సెప్టెంబర్ 25న గ్రాండ్‌గా విడుదలైన ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా మొదటి షో నుంచే బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. స్టార్ డైరెక్టర్ సుజిత్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రేక్షకుల అంచనాలను మించి తనదైన స్టైల్, పవర్ ఫుల్ యాక్షన్‌తో పవన్ కల్యాణ్ అలరించడంతో సినిమా మొదటి రోజే రూ.154 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ నమోదు చేసి, సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇక డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణ సంస్థ అధికారికంగా , 'ఓజీ' సినిమా నాలుగు రోజుల్లోనే రూ.252 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్టు పేర్కొంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఓ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేసి సంతోషం వ్యక్తం చేసింది. పాన్ ఇండియా రేంజ్‌లో విడుదలైన 'ఓజీ' అమెరికాలో కూడా ప్రభంజనం సృష్టిస్తోంది. $5 మిలియన్ (దాదాపు రూ.40 కోట్లు) కలెక్షన్లు వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఓజీ సినిమా ఓవర్సీస్ మార్కెట్లో పవన్ కల్యాణ్ కెరీర్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలిచింది. పవన్ కల్యాణ్ స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ లుక్, థమన్ సంగీతం, పవర్ఫుల్ బీజీఎం, అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌లు, హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్ గ్లామరస్ ప్రెజెన్స్, విలన్‌గా ఇమ్రాన్ హష్మీ పవర్ ఫుల్ రోల్ సినిమాకి చాలా ప్లస్ అయ్యాయి. ఇక ఈ సినిమాలో ప్రముఖులు శ్రియా రెడ్డి, అర్జున్ దాస్, జగపతి బాబు, ప్రకాశ్ రాజ్, రావు రమేష్, అభిమన్యు సింగ్, తదితరులు తమ పాత్రలతో ఆకట్టుకున్నారు. వెన్నెల కిశోర్, కిక్ శ్యామ్, బిగ్ బాస్ ఫేమ్ శుభశ్రీ రాయగురు లాంటి వారు కూడా కీలక పాత్రల్లో కనిపించి మెప్పించారు ప్రస్తుత టాక్, కలెక్షన్లు చూస్తుంటే పవన్ కల్యాణ్ కెరీర్‌లోనే ఇది మోస్ట్ సక్సెస్‌ఫుల్ సినిమాగా నిలవనుందని విశ్లేషకుల అంచనా. సినిమా సక్సెస్‌తో అభిమానులు ఫుల్ జోష్‌లో ఉండగా, చిత్ర బృందం విజయోత్సవాలకు సిద్ధమవుతోంది. ఓజీకి సీక్వెల్ కూడా ఉంటుందని మేకర్స్ ప్రకటించగా , ఆ సీక్వెల్‌లో పవన్ కళ్యాణ్ నటిస్తారా, లేకుంటే వేరే హీరోతో మూవీని తెరకెక్కిస్తారా అన్నది చూడాలి.



## సుడిగాలి సుధీర్ పాన్ ఇండియా మూవీ

జబర్దస్త్ కామెడీ షో ఫేమ్ తెచ్చుకున్న సుడిగాలి సుధీర్.. ఆ తర్వాత హీరోగానూ ఎంట్రీ ఇచ్చాడు. సాఫ్ట్‌వేర్ సుధీర్, గాలోడు లాంటి చిత్రాలతో మెప్పించాడు. తాజాగా మరో కొత్త సినిమాను ప్రకటించాడు. తన కెరీర్‌లో వస్తోన్న ఐదో చిత్రానికి హైలెస్సో అనే టైటిల్ ఖరారు చేశారు. టైటిల్‌తో పాటు పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ మూవీకి కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల చేయనున్నారు. ఈ నాలుగు భాషల్లోనూ రిలీజ్ చేసిన మూవీ పోస్టర్స్ అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాతో సుడిగాలి సుధీర్ పాన్ ఇండియా హీరోగా మారనున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com